https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే చాటింపు

సారథ్యంలో

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 24 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ గురువారం,అక్టోబర్,22, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-



యాదాద్రి పవర్ ప్లాంట్..

5వ యూనిట్ సింక్రనైజేషన్ సక్సెస్

సీఎం ఆదేశాలతో కదిలిన యంత్రాంగం



నల్గొండ,అక్టోబర్,21: నల్లగొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) 5వ యూనిట్ (800 మెగావాట్లు) గ్రిడ్‌కు విజయవంతంగా అనుసంధానమైంది. ఉదయం 11:06 గంటలకు సింక్రనైజేషన్ పూర్తి చేసిన అనంతరం, తదుపరి వాణిజ్య ఉత్పత్తి (సీవోడీ) చర్యల కోసం హ్యాండ్ ట్రిప్ చేసినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 4000 మెగావాట్ల సామర్థ్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటికే నాలుగు యూనిట్లు అందుబాటులోకి రాగా, చివరిదైన 5వ యూనిట్ కూడా గ్రిడ్‌కు కనెక్ట్ కావడంతో ప్రాజెక్ట్ పూర్తయినట్లేనని టీజీజెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్ పేర్కొన్నారు. ఈ మైలురాయిని సాధించిన జెన్‌కో, బీహెచ్ఈఎల్ బృందాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం భారీగా నెలకొన్న విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో వైటీపీఎస్?లో సామర్థ్యం మేరకు విద్యుత్ ఉత్పాదన జరగకపోవడంపై విమర్శలు వచ్చాయి. అయితే కాగా బొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పాదన జరగకపోవడంపై ఇటీవల సంబంధిత అధికారులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. అలసత్వం వహించే అధికారులపై వేటు తప్పదని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. వారంలోగా యూనిట్-5 సింక్ర నైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో జెన్‌కో సీఎండీ ఎస్. హరీశ్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్‌మిట్టల్ వైటీపీఎస్ వద్ద పనులు వేగవంతం అయ్యేలా పర్యవేక్షణ పెట్టారు. అలాగే నాలుగు యూనిట్లలో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందా? లేదా? ఉత్పాదనకు అవసరమైన బొగ్గు అందుతుందా? ప్లాంట్‌కు అవసరమైన బొగ్గును తరలించే రేకులు అన్‌లోడ్ అవుతున్నాయా? లేదా? వంటి అంశాలను పరిశీలించేందుకు ప్రభుత్వం ఐదుగురు ఐఏఎస్‌లను నియమించింది. ఈ పరిణామాల మధ్య ఇవాళ 5వ యూనిట్ (800 మెగావాట్లు) గ్రిడ్‌కు విజయవంతంగా అనుసంధానమైనట్లు అధికారులు వెల్లడించారు.

అమెరికా-పాక్ దోస్తీ..

భారత్‌కు అగ్రరాజ్యం కీలక హామీ!

న్యూఢిల్లీ,అక్టోబర్,21: అమెరికా, పాకిస్థాన్ మధ్య సాన్నిహిత్యం పెరుగుతున్న వేళ భారత్‌కు అగ్రరాజ్యం భరోసా ఇచ్చింది. ఇతర దేశాలతో తమ సంబంధాల వల్ల భారత్‌తో బంధానికి ఎలాంటి నష్టం జరగదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పష్టం చేశారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం, పరస్పర సహకారానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు.పాకిస్థాన్‌తో సంబంధాలు అవసరమేనని రూబి యో అన్నారు. ఆ దేశంతో తమకున్న సంబంధాలను సానుకూలంగా ఉపయోగించుకోవచ్చని చెప్పారు. భారత్‌ను ఆందోళనకు గురిచేసే చర్యలను పాకిస్థాన్ నిరుత్సాహపరిచేలా తమ ప్రభావాన్ని ఉపయోగిస్తామని తెలిపారు. తద్వారా ప్రాంతీయ ఘర్షణలు తలెత్తకుండా చూడవచ్చని అభిప్రాయపడ్డారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కోసం చేస్తున్న ప్రయత్నాలు, ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న చర్చలు తమ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులను 1970ల నాటి అమెరికా విదేశాంగ విధానంతో పోల్చడం సరికాదని రూబియో అన్నారు. అప్పట్లో ప్రచ్ఛన్న యుద్ధం సహా అనేక పరిణామాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రపంచపరిస్థితులు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. అప్పట్లో అమెరికాఅధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ హయాంలో పాకిస్థాన్ సైనిక పాలకులకు వాషింగ్టన్ మద్దతుగా నిలిచింది. రెండు రోజుల భారత పర్యటనలో ఉన్న రూబియో రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపైనా స్పందిం చారు. నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఈ యుద్ధానికి పరిష్కారం కనుగొనడం అంత సులువు కాదని అన్నారు. సమస్యను పరిష్కరించడం తేలికై ఉంటే ఇప్పటికే యుద్ధం ముగిసిపోయేదని వ్యాఖ్యానించారు.

ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు..

పిల్ల చేష్టలని కొట్టిపడేసిన బీజేపీ..



న్యూఢిల్లీ,అక్టోబర్,21: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఆర్ఎస్ఎస్ అనేది కేవలం పురుషులతో కూడిన రాజ్యాంగ వ్యతిరేక సంస్థ అని ఆరోపించారు. మహిళలను పురుషుల ఆస్తిగా భావిస్తుందని విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు స్పందించారు. రాహుల్ గాంధీకి సరైన అవగాహన లేదని, ఆయన వ్యాఖ్యలు పిల్లచేష్టలను తలపిస్తున్నాయని విమర్శించారు ఆర్ఎస్ఎస్‌ను విమర్శిస్తూ రాహుల్ గాంధీ మంగళవారం ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. ‘ఆర్ఎస్ఎస్ అనేది మహిళలను పురుషుల ఆస్తిగా భావిస్తుంది. పూర్తిగా పురుషులతో కూడిన రాజ్యాంగ వ్యతిరేక సంస్థ. నేను శివ శక్తిని నమ్ముతాను. అందుకే ఆర్ఎస్ఎస్‌తో పోరాడటం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. మరో విషయం ఏమిటంటే, ఆర్ఎస్ఎస్‌కు చెందిన చాలా మంది మహిళలు నా పక్షాన ఉన్నారు’ అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు ఆర్ఎస్ఎస్‌పై విమర్శలు చేసే ముందు ఆ సంస్థ గురించి అధ్యయనం చేయాలని మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే రామ్ కదమ్ సూచించారు మహిళల కోసం ప్రత్యేకంగా పనిచేసే విభాగం ఆర్ఎస్ఎస్‌కు ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మహిళలు ఆ సంస్థ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని తెలిపారు.

బలపరీక్ష పెడితే తృణమూల్ ఎమ్మెల్యేల మద్దతూ మాకే..

బెంగాల్ సీఎం సువేందు సంచలన వ్యాఖ్యలు



కోల్‌కతా,అక్టోబర్,21: 49 ఏళ్ల వామపక్ష, టీఎంసీ పాలన సమస్యలను పరిష్కరిస్తున్నామన్న సీఎం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో రేపే బలపరీక్ష (ఫ్లోర్ టెస్ట్) నిర్వహించినా, తమ ప్రభుత్వానికి 275 మంది ఎమ్మెల్యేల మద్దతు లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) టికెట్‌పై గెలిచిన 64 మంది శాసనసభ్యులు కూడా తమకే మద్దతిస్తారని, దీంతో తమ సంఖ్య 275కి చేరుకుంటుందని బుధవారం స్పష్టం చేశారు. కోల్‌కతాలోని చోర్‌బగాన్‌లో ఇటీవల దుర్గా పూజ మండపం వద్ద జరిగిన తొక్కిసలాటలో మరణించిన బాధితుడి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. “రేపు అసెంబ్లీలో బలపరీక్ష పెట్టమనండి. మా సంఖ్య 275కి చేరుకుంటుంది” అని అన్నారు. ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సోషల్ మీడియా లేదా టీవీ చర్చల ద్వారా రాలేదని, ప్రజల ప్రత్యక్ష మద్దతుతోనే సాధ్యమైందని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా భవానీపూర్‌లో మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఓడించిన విషయాన్ని గుర్తు చేస్తూ తమది ప్రజలు ఎన్నుకున్న ‘సనాతన’ ప్రభుత్వమని సువేందు అధికారి అభివర్ణించారు. గత 49 ఏళ్లుగా వామపక్ష, టీఎంసీ పాలనలో పేరుకుపోయిన సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరిస్తోందని విమర్శించారు. 2026లో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 294 స్థానాలకు గాను, 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరదించుతూ బీజేపీ 208 సీట్లు గెలుచుకుని అధికారం చేపట్టింది. టీఎంసీ కేవలం 80 స్థానాలకే పరిమితమైంది. ఎన్నికల ఫలితాల అనంతరం టీఎంసీలో అంతర్గత విభేదాలు తలెత్తడం, పార్టీ గుర్తు కోసం ఓ వర్గం న్యాయపోరాటం చేస్తున్న నేపథ్యంలో సువేందు అధికారి వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

జవహర్‌నగర్ డంప్ యార్డు తరలింపే లక్ష్యం..

ఈనెల 27 నుంచి ఎంపీ ఈటల పాదయాత్ర



హైదరాబాద్,అక్టోబర్,21: మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని జవహర్‌నగర్ డంప్ యార్డు ను తక్షణమే వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేస్తూ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ా దయాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 27 నుంచి ఈ పాదయాత్ర ప్రారంభం కానుంది. ఏళ్లుగా జవహర్‌నగర్ డంప్ యార్డు కారణంగా ఎదురవుతున్న దుర్వాసన, కాలుష్యం, ఆరోగ్య సమస్యలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, డంప్ యార్డును అక్కడి నుంచి ఖాళీ చేయించాలని డిమాండ్ చేస్తూ ఈటల రాజేందర్ పోరాటానికి సిద్ధమయ్యారు.ఈ పాదయాత్రకు సంబంధించి కార్యాచరణను రూపొందించేందుకు, బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఆయన ఎల్లుండి డంప్ యార్డ్ బాధితులు, స్థానికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. స్థానికుల అభిప్రాయాలు, సమస్యలను స్వీకరించిన అనంతరం పాదయాత్ర రూట్ మ్యాప్, తదితర వివరాలను వెల్లడించనున్నారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఈ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణలో మద్యం అమ్మకాల జోరు..

19 రోజుల్లోనే రూ.2,054 కోట్లు



హైదరాబాద్,అక్టోబర్,21: తెలంగాణలో దసరా పండుగ సీజన్‌లో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. అక్టోబర్ 1 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా రూ. 2,054.51 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే విక్రయాలు 37.02 శాతం పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు వెల్లడించాయి. పండుగ వేళ బీర్లకు డిమాండ్ గణనీయంగా పెరగడం ఈసారి ప్రత్యేకంగా కనిపించింది.ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్‌తో పోలిస్తే బీర్ల విక్రయాలు వేగంగా పెరిగాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 19 వరకు 21.55 లక్షల కేసుల బీర్లు అమ్ముడవగా, ఈ ఏడాది ఆ సంఖ్య 30.37 లక్షల కేసులకు చేరింది. దీంతో బీర్ల అమ్మకాల్లో 41 శాతానికి పైగా వృద్ధి నమోదైంది. ఇక ×వీఖీూ విక్రయాలు గత ఏడాది 14.16 లక్షల కేసులుగా ఉండగా, ఈసారి 18.38 లక్షల కేసులకు పెరిగాయి.అక్టోబర్ 19న రాష్ట్రంలో ఒక్కరోజే రూ. 303.40 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. పండుగ సీజన్ ప్రారంభంలో అమ్మకాలు నెమ్మదిగా సాగినా, రెండో వారం నుంచి వేగం పుంజుకున్నాయి. అక్టోబర్ 16 నాటికి మొత్తం విక్రయాల విలువ రూ. 1,527.85 కోట్లుగా ఉండగా, మరో మూడు రోజుల్లోనే రూ. 2,000 కోట్ల మార్కును దాటింది. అక్టోబర్ 19 వరకు నమోదైన గణాంకాల ఆధారంగానే ఈ వివరాలను ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.

మైసూరు దసరా ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి..

చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



బెంగళూరు,అక్టోబర్,21: కర్ణాటక రాష్ట్రంలో అత్యంత వైభవంగా నిర్వహించే చారిత్రక మైసూరు దసరా ఉత్సవాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాలను వీక్షించేందుకు ముఖ్యమంత్రి మైసూరుకు చేరుకున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు ఈ వేడుకల్లో పాల్గొన్న ఆయన.. ముందుగా మైసూరు ప్రజల ఆరాధ్య దైవమైన చాముండేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని.. ప్రజలందరికీ మంచి జరగాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం మైసూరు రాజభవనం ఎదుట అత్యంత వైభవంగా నిర్వహించిన దసరా ఉత్సవాల్లో పాల్గొన్నారు. మైసూరు దసరా ఉత్సవాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఉత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన జంబూ సవారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తిగా వీక్షించారు. అందంగా అలంకరించిన ఏనుగుపై బంగారు అంబారీలో కొలువుదీరిన చాముండేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు. సంప్రదాయ వాయిద్యాల నడుమ, కన్నడ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళాకారులు, సంగీత బృందాలు, నృత్య బృందాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో సాగిన ఈ ఊరేగింపు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది.రంగురంగుల వస్త్రధారణలు, సంప్రదాయ నృత్యాలు, కళాకారుల ప్రదర్శనలు, అలంకరించిన ఏనుగులు ఈ వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చాయి. కర్ణాటకలో రాష్ట్ర పండుగగా జరుపుకునే నాడ హబ్బ ఉత్సవాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి, కళలు, చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. ఈ వేడుకల్లో కేరళకు చెందిన ప్రముఖులతో పాటు దేశ, విదేశాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని ఉత్సవాలను వీక్షించారు. వివిధ రాష్ట్రాల నాయకులు, ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలు జాతీయ స్థాయిలో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

ఢిల్లీలో మళ్లీ పెరిగిన వాయు కాలుష్యం..



దేశ రాజధాని ఢిల్లీ ప్రజలు తరచూ వాయు కాలుష్యం ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు. ఇప్పటికే అనేక సార్లు ఢిల్లీని వణికించిన వాయు కాలుష్యం... తాజాగా మరోసారి విజృంభించింది. స్థానికంగా వాయు నాణ్యత సూచీ దిగజారడంతో ‘సెంట్రల్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సీఏక్యూఎం)’ ఈ సీజన్‌లో తొలిసారి ఆంక్షలు విధించింది. ఢిల్లీ - ఎన్‌సీఆర్ పరిధిలో ‘గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్-1 నిబంధనలను తక్షణమే అమల్లోకి తీసుకొస్తున్నట్లు సీఏక్యూఎం ప్రకటించింది. ఢిల్లీలో వాయు కాలుష్యం పెరిగిన నేపథ్యంలో సెంట్రల్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ చైర్‌పర్సన్ రాజేశ్ వర్మ.. ఉన్నతాధికారులు, పలు ప్రభుత్వ విభాగాలతో సమక్షా సమావేశం నిర్వహించింది. నగరంలో వాయు కాలుష్య సమస్యపై సమీక్షించడంతో పాటు రాబోయే రోజుల్లో కాలుష్య నివారణ చర్యలపై చర్చించారు.ఢిల్లీలో ఈ నెల 20న వాయు నాణ్యత సూచీ 179గా నమోదు కాగా.. ఇవాళ(బుధవారం) మధ్యాహ్నం 2గంటలకు 244కి ఒక్కసారిగా పెరిగిందని సీఏక్యూఎం పేర్కొంది.రాబోయే రోజుల్లో వాయు నాణ్యత సూచీ ‘పూర్’ కేటగిరీలోనే ఉంటుందని ఐఎండీ తెలిపింది. వాయు నాణ్యత మరింతగా క్షీణించకుండా నిరోధించేందుకు జీఆర్ఏపీ-1 నిబంధనలను వెంటనే అమలు చేయాలని సీఏక్యూఎం పేర్కొంది. ఈ నిబంధనల కింద గ్రాప్-1 కింద హోటళ్లు, రెస్టారెంట్లలో ఇంధనంగా బొగ్గు, వంట చెరకు వాడకూడదు. అలానేఅత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డీజిల్ జనరేటర్ల వాడకానికి అనుమతించాలని సీఏక్యూఎం స్పష్టం చేసింది.

ఉప్పల్ మెట్రో స్టేషన్‌లో ఆధార్ సేవా కేంద్రం
మిగతా వాటితో పోల్చితే ఇది ఎంతో ప్రత్యేకం





మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా(డీకే చాటింపు): మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రజలకు శుభవార్త. ఉప్పల్ మెట్రోరైల్ స్టేషన్‌లో ఆధార్ సేవా కేంద్రం అందుబాటులోకి వచ్చింది. ఉప్పల్ నుంచి నాగోల్‌కి వెళ్లే వైపు మెట్రో స్టేషన్ ఫస్ట్ ఫ్లోర్‌లో లిఫ్ట్ పక్కన దీన్ని ఏర్పాటుచేశారు. జిల్లా మొత్తమ్మీద ఇలాంటి కేంద్రం ఒక్కటే ఉందని, ఇక్కడ అందించే సేవలు మిగతా సెంటర్లతో పోల్చితే ఎంతో ప్రత్యేకమని ఆధార్ సేవా కేంద్రం ఆపరేషన్స్ మేనేజర్ చేబ్రోలు కార్తీక్ వివరించారు. అవి ఆయన మాటల్లోనే.. కేంద్ర ప్రభుత్వ అనుమతులన్నీ పొందిన ఈ సెంటర్ ఈ వారంలోనే లాంఛనంగా ప్రారంభంకానుంది. అయితే సేవలను మాత్రం ఇప్పటికే మొదలుపెట్టాం. మిగతా ఆధార్ నమోదు కేంద్రాల కన్నా ఇక్కడ అందించే సర్వీసులకు ఛార్జీలు చాలా తక్కువ. సెంట్రల్ గవర్నమెంట్ నిర్దేశించిన రుసుముల కన్నా ఒక్క రూపాయి కూడా ఎక్కువ తీసుకోం. పైగా వసూలు చేసే ప్రతి రూపాయికీ రసీదు ఇస్తాం. ఆదివారం సహా అన్ని రోజులు తెరిచే ఉంచుతాం. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదున్నర వరకు కార్యకలాపాలు కొనసాగుతాయి. సాయంత్రం ఐదున్నర లోపు ఎంత మంది వచ్చినా టోకెన్లు ఇస్తాం. దీనికి లిమిట్ అంటూ ఏమీ లేదు. సర్వీసుల ప్రాసెస్ కూడా చాలా ఫాస్ట్‌గా జరుగుతుంది. శిక్షణ పొందిన, అనుభవం కలిగిన సిబ్బంది, క్యాబిన్లు ఎక్కువ ఉండటం వల్ల పెద్దగా వెయింటింగ్ చేయాల్సిన అవసరం కూడా ఉండదు. వచ్చినవాళ్లకు వచ్చినట్లు వెంటనే సర్వీసు స్టార్ట్ చేస్తాం. ఏడాదిలోపు శిశువులకు, గర్భిణులకు, ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులకు, దివ్యాంగులకు, వయసు మీద పడిన వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తాం. ఏజ్ లిమిట్, నేమ్ కరెక్షన్స్ లిమిట్(2 సార్లు) దాటినవారికి, 18 ఏళ్లు పైబడిన వారికి కూడా ఎన్‌రోల్‌మెంట్ చేస్తాం. 5 నుంచి 7 ఏళ్లు, 15 నుంచి 17 ఏళ్ల వయసు కలిగినవారికి మ్యాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితంగా చేస్తాం. ఈ అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం ఏడాది వరకు (2027 సెప్టెంబర్ దాక) పొడిగించింది. ఆధార్ కార్డ్‌లో ఏపీ అడ్రస్ ఉన్నవాళ్లు తెలంగాణ అడ్రస్‌ను అప్‌డేట్ చేసుకోవాలంటే ఈ కేంద్రంలో మాత్రమే అనుమతి ఉంది. ఈ అవకాశాన్ని గవర్నమెంట్ మరో మూడు నెలలు అందిస్తోంది. సురక్షితమైన, నమ్మకమైన సేవలు ఇక్కడ లభిస్తాయి. బయోమెట్రిక్ అప్‌డేట్‌కి రూ.125, డెమొగ్రఫిక్ అప్‌డేట్‌కి రూ.75, డౌన్‌లోడ్, కలర్ ప్రింట్‌కి రూ.40 మాత్రమే తీసుకుంటాం. ఆధార్ స్టేటస్ లేదా అప్‌డేట్ రిక్వెస్ట్ సౌకర్యం కూడా ఈ కేంద్రంలో ఉంది. పేరు, చిరునామా, పుట్టిన తేదీ, జెండర్ (లింగం), మొబైల్ నంబర్, ఇమెయిల్, ఫొటో, ఫింగర్ ప్రింట్, ఐరిస్ స్కాన్ తదితర సర్వీసులను ఇక్కడ పొందొచ్చు. జిల్లా ప్రజలకు ఈ ఆధార్ సేవా కేంద్రం దగ్గరలోనే ఉంటుంది. ఉప్పల్ మెట్రో స్టేషన్, ఉప్పల్ రింగ్ రోడ్ బస్ స్టాప్‌కి అతి సమీపంలోనే ఈ సెంటర్ ఉండటం వల్ల మెట్రో రైల్‌లో, ఆర్టీసీ బస్సుల్లో వచ్చేవారు తేలిగ్గా ఇక్కడికి చేరుకోవచ్చు.

పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయం
శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల్ (డీకే చాటింపు):సమాజంలో శాంతి, సామరస్యం నెలకొల్పడంతో పాటు ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించడంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలకు కమీషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..... ప్రజల భద్రత కోసం పోలీసులు 24 గంటల పాటు విధులు నిర్వహిస్తూ, అవసరమైన సందర్భాలలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేస్తున్నారని, పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం అందరి బాధ్యత అని తెలిపారు. దేశ సరిహద్దుల పరిరక్షణలో సైన్యం, నావికాదళం, వైమానిక దళం కీలక పాత్ర పోషిస్తుండగా, దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతను పోలీసులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. సమాజంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం, ప్రజలకు రక్షణ కల్పించడం, శాంతి భద్రతలను కాపాడటం పోలీసుల ప్రధాన బాధ్యతలని తెలిపారు. రాష్ట్రంలో, దేశంలో శాంతి సామరస్యాలు నెలకొన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని, పోలీసు శాఖ నిరంతర కృషి, అంకిత భావం వల్ల ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించగలుగు తున్నారని తెలిపారు. పోలీసు విధులు సవాళ్లతో కూడుకున్నవని, ప్రజల రక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. ప్రజలు తమ బాధ్యతను గుర్తించి చట్టాలను, నిబంధనలను పాటించాలని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. సామాజిక బాధ్యత, పౌర స్పృహతో నిబంధనలు పాటించడం ద్వారా సమాజంలో సమస్యలను తగ్గించి, మెరుగైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. పోలీసు శాఖకు ప్రజలు సహకరించడం ద్వారా శాంతిభద్రతల పరిరక్షణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని, తద్వారా అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ.. 1959 అక్టోబర్ 21న భారత సరిహద్దు గస్తీ విధులలో ఉన్న సిఆర్‌పిఎఫ్ బృందంపై శత్రు బలగాలు ఆకస్మిక దాడి చేయగా, మన జవాన్లు వీరోచితంగా పోరాడి వీరమరణం పొందారని, ఆ చారిత్రక ఘటన స్ఫూర్తితోనే దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని అమరవీరుల స్మారకంగా నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఉన్నత ఆశయం కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టి అంకితభావంతో పని చేస్తారని, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన ప్రతీ పోలీస్, సైనిక జవాను త్యాగం వెలకట్టలేనిదని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రతా సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడం, ప్రజల ప్రాణ, ఆస్తులకు రక్షణ కల్పించడమే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. విధులలో ఉండే సిబ్బంది అంతా పూర్తి మనస్ఫూర్తిగా, అంకితభావంతో పని చేస్తూ పోలీస్ వ్యవస్థ గౌరవాన్ని మరింత పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో రావణ దహన కార్యక్రమం
ఎమ్మెల్యేను ఆహ్వానించిన సార్వజనిక్ గణేష్ మండలి కమిటీ





నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 21 (డీకే చాటింపు):బాన్సువాడ నియోజకవర్గం కోటగిరిలో పది రోజులుగా జరుగుతున్న దేవి నవరాత్రి ఉత్సవాలు లో భాగంగా విజయదశమి రోజు రావణ దహనం కార్యక్రమానికి హాజరు కావాలని స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం పట్ల కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.

ఎంబీబీస్ విద్యార్థిని అనన్యకు
ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అభినందనలు..
10వేలు ఆర్థిక సహకారం అందచేత....



బెల్లంపల్లి(డీకే చాటింపు) మండలంలోని చంద్రవెల్లి గ్రామానికి చెందిన కొండపల్లి నర్సయ్య కుమార్తె కొండపల్లి అనన్యకు ఎంబీబీఎస్ లో ఉచిత సీటు లభించింది. ఈ సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అనన్యను అభినందించి, 10,000 వేల రూపాయలు నగదు ప్రోత్సాహకంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆదర్శ్ వర్ధన్ రాజు,ఎనగందుల వెంకటేష్, మణి వర్మ అనన్యకు అభినందనలు తెలిపారు. అనన్య భవిష్యత్తులో గొప్ప వైద్యురాలిగా ఎదిగి ప్రజలకు సేవలందించాలని మనస్ఫూర్తిగా కోరారు.

వరుస చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులు అరెస్ట్
-నారాయణపేట డీఎస్పీ నల్లపు లింగయ్య... -ఐదు చోరీ కేసుల్లో నిందితుల ప్రమేయం... -సుమారు 4 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం...



నారాయణపేట,(డీకే చాటింపు): జిల్లాతో పాటు ఇతర పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన వరుస చోరీ కేసులను మరికల్ పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు నారాయణపేట డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. బుధవారం నారాయణపేట సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆయా కేసుల వివరాలను వెల్లడించారు.

కేసు వివరాలు:

ఈ నెల 9న మరికల్ మండలం మద్వార్ రోడ్డు వద్ద పల్లెగడ్డ గ్రామానికి చెందిన ఫిర్యాదుదారు పతేరచ్చేడు సత్యమ్మను మోసగించి సుమారు ఒకటిన్నర తులాల బంగారు నల్లపూసల తాడును అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మరికల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ఆదేశాల మేరకు డీఎస్పీ నల్లపు లింగయ్య పర్యవేక్షణలో మరికల్ సీఐ భాగవంత్ రెడ్డి,సీసీఎస్ ఎస్ఐ విజయ్ భాస్కర్, మరికల్ ఎస్ఐ రాంలాల్ క్రైమ్ టీమ్ దర్యాప్తులో కీలకంగా వ్యవహరించారు. దర్యాప్తులో భాగంగా బుధవారం ఉదయం సుమారు 6:30గంటలకు ఆత్మకూర్ రోడ్డు సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వారిని కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా యాపర్లదిన్నె మండలం బూడిదిపాడు గ్రామానికి చెందిన క్రిస్టప్ప(30),అలాగే తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లాలోని జమ్మిచేడు గ్రామానికి చెందిన బోయ జమ్మన్న(46) గుర్తించారు.

పోలీసుల విచారణలో వీరు మరికల్‌లో జరిగిన చోరీతో పాటు ఆత్మకూర్,మక్తల్, దేవరకద్ర పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన మరో నాలుగు చోరీ కేసుల్లోనూ ప్రమేయం ఉన్నట్లు వెల్లడైంది.

ఐదు కేసుల్లో చోరీకి గురైన ఆస్తుల వివరాలు:

మరికల్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 227/2026– ఒకటిన్నర తులాల బంగారు నల్లపూసల తాడు. ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 144/2026–అర తులం బంగారు పుస్తెల తాడు, రూ.3వేల నగదు. మక్తల్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 429/2026–తులం బంగారు పుస్తెల కొలువుల దండ.

దేవరకద్ర పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 152/2026–అర తులం బంగారు పుస్తెల కొలువుల దండ. దేవరకద్ర పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 153/2026–అర తులం బంగారు పుస్తెల కొలువుల దండ. ఈ ఐదు కేసులకు సంబంధించి నిందితుల నుంచి మొత్తం సుమారు 4 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్ కు తరలించడం జరిగిందని డీఎస్పీ తెలిపారు.

దర్యాప్తు బృందానికి అభినందనలు:

ఈ వరుస చోరీ కేసులను ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన మరికల్ సీఐ భాగవంత్ రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ విజయ్ భాస్కర్, మరికల్ ఎస్ఐ రాంలాల్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య, కానిస్టేబుళ్లు తిరుపతిరెడ్డి, రవిలను డీఎస్పీ నల్లపు లింగయ్య అభినందించారు.

రాక్ టౌన్ కాలనీలో అంగరంగ
వైభవంగా విజయదశమి సంబరాలు

హైదరాబాద్: (డీకే చాటింపు) రాక్ టౌన్ కాలనీలోని కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో విజయదశమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. సుమారు 2,000 మంది పిల్లలు, పెద్దలు, మహిళలు ఈ వేడుకల్లో పాల్గొని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. రాక్ టౌన్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 1998 సంవత్సరం నుంచి ప్రతి ఏటా ఈ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. విజయదశమి సందర్భంగా ఆయుధ పూజ, శమీ పూజ, రావణ దహనం వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను వీక్షించేందుకు చుట్టుపక్కల కాలనీలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఇతర ప్రాంతాలకు భిన్నంగా రాక్ టౌన్ కాలనీలో పండుగలను ఎంతో వైభవంగా, అందరినీ కలుపుకొని నిర్వహిస్తారని పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, రాక్ టౌన్ కాలనీ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఏడాది నిర్వహించిన పండుగలు, వివిధ కార్యక్రమాలు ఎంతో అద్భుతంగా, విజయవంతంగా జరిగాయని కొనియాడారు. కాలనీవాసులందరినీ సమన్వయం చేసుకుంటూ ప్రతి కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం రాక్ టౌన్ కాలనీ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి మాట్లాడుతూ, ‘‘కాలనీలో పండుగలను ఇంత విజయవంతంగా నిర్వహించడానికి కమిటీ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు, పిల్లలు అందిస్తున్న సహకారమే ప్రధాన కారణం. ప్రతి ఒక్కరి భాగస్వామ్యం, సహకారంతోనే ఈ వేడుకలను ఇంత ఘనంగా జరుపుకోగలుగుతున్నాం’’ అని తెలిపారు. విజయదశమి వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా భావించే బంగారం జమ్మి ఆకులను పరస్పరం పంచుకుంటూ, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులతో ఆలయ్ బలయ్ చేసుకున్నారు. ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకున్నారు. చివరగా చెడుపై మంచి, అధర్మంపై ధర్మం విజయం సాధిస్తాయనే సందేశంతో రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాక్ టౌన్ కాలనీ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ “జై శ్రీరామ్.. జై శ్రీరామ్.. జై శ్రీరామ్” అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సనాతన ధర్మ విలువలను పాటిస్తూ, ధర్మమార్గంలో ముందుకు సాగాలనే సందేశంతో రాక్ టౌన్ కాలనీలో విజయదశమి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో ముగిశాయి.







అమెరికాకు 62 వేల కోట్ల నష్టం
ఒడిదుడుకుల్లో ఆర్థికం



న్యూయార్క్ : ఏ ముహూర్తంలో ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాడో తెలియదు గాని.. ఆ దేశానికి ఏది కూడా కలిసి రావడం లేదు. ఆంక్షలు.. సుంకాలు.. ప్రపంచ దేశాలను అనేక విధాలుగా ఇబ్బంది పెడుతున్నాడు ట్రంప్. ఒక రకంగా ప్రత్యక్ష నరకం అంటే ఏమిటో చూపిస్తున్నాడు. వాస్తవానికి ట్రంప్ విధిస్తున్న సుంకాలవల్ల ప్రపంచ దేశాల కంటే అమెరికాకే నష్టం ఎక్కువగా జరుగుతోంది. ఈ విషయాన్ని ట్రంప్ గుర్తించడం లేదు. ఏమాత్రం లెక్కలోకి తీసుకోవడం లేదు.ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు ప్రపంచ దేశాలను ఇబ్బంది పెడుతోంది. అమెరికాలోని విపక్ష పార్టీల నేతలు కూడా ట్రంప్ తీరు పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా అమెరికాలో కీలక బిల్లుల విషయంలో విపక్ష పార్టీ నిరసన వ్యక్తం చేసింది. బిల్లుల విషయంలో అధికార పార్టీ తీసుకొచ్చిన విధానాలకు వ్యతిరేకంగా స్వరం వినిపించింది. దీంతో అమెరికా ప్రభుత్వం ప్రస్తుతం షట్ డౌన్ అనే పరిస్థితిని ఎదుర్కొంటున్నది. గడిచిన 31 రోజులుగా అమెరికా ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. దీనివల్ల అమెరికాలో ఏకంగా 62,000 కోట్ల సంపద ఆవిరి అయిపోయింది.పరిస్థితి ఇలాగే కొనసాగితే 11 బిలియన్ డాలర్ల సంపద ఆవిరి అయిపోతుందని కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ పేర్కొంది. ఈ షట్ డౌన్ చాప కింద నీరు లాగా విస్తరిస్తోందని ఆర్థిక రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
గురువారం,అక్టోబర్,22, 2026

చావొక్కటే.. అన్నింటికీ పరిష్కారం కాదు

జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా ఎదుర్కోవాలి! ఎవరి జీవితం కూడా పూల పాన్పు కాదు. ఈ డైలాగ్‌ని.. మన జీవితంలో ఎప్పుడో ఒకసారి వినే ఉంటాం. ఎక్కడో ఓ చోట చదివే ఉంటాం. లైఫ్ అంటే.. ఎప్పుడూ సుఖంగా, అన్ని రోజులూ సంతోషంగా ఉండదని తెలుసు. కష్టాలు, సుఖాలు, సవాళ్లు, సమస్యలు.. అందరికీ ఉంటాయ్. ఇవన్నీ.. ఏదో ఒక ఫేజ్‌లో ఎదుర్కోక తప్పదు. అయినా సరే.. జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా.. ఎదుర్కోవాలి. వాటన్నింటిని ధైర్యంగా దాటుకొని.. ముందుకు సాగాలి. కానీ.. ఈరోజులు అలా లేవు. కాలం మారేకొద్దీ.. పబ్లిక్ మరింత వీక్‌గా తయారవుతున్నారు. చిన్న చిన్న విషయాలకే.. చాలా పెద్ద నిర్ణయాలు తీసుకుంటున్నారు. తనువు చాలిస్తున్నారు. సమస్య వస్తే చాలు.. దాన్ని ఎదుర్కోలేక చచ్చిపోతున్నారు. ఇటీవలి కాలంలో చిన్నా, పెద్ద, యువత, ముసలి, ముతకా అనే తేడా లేదు. అందరిదీ అదే దారి. ఎంతో అందమైన జీవితాన్ని గెలవలేక.. అర్ధాంతరంగా చనిపోతున్నారు. అసలు.. ఓ చిన్న సమస్యని కూడా ఎదుర్కొనే ధైర్యం లేకుండా ఎలా ఉంటున్నారు? దేనినైనా తట్టుకోగలిగే, ఎదుర్కోగలిగే ఆత్మవిశ్వాసం ఏమైపోయిందనే ప్రశ్నలే.. ఇప్పుడు అందరిలోనూ తలెత్తుతున్నాయ్. సీఏ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో విశాఖలో యువకుడు ఆత్మహత్య సీఏ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో.. తల్లిదండ్రులను మోసం చేశాననే మనస్తాపంతో విశాఖలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొబ్బరితోట ఏరియాలో ఓ గదిని అద్దెకు తీసుకొని.. హీలియం గ్యాస్‌తో ముఖానికి కవర్ తగిలించుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు..మళ్లీ పాస్ అయ్యే చాన్స్ ఉంటుంది హైదరాబాద్‌లో రెండేళ్ల కూతురితో తల్లి ఆత్మహత్య హైదరాబాద్‌లో కుటుంబ కలహాలతో.. హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది కీర్తిక అగర్వాల్. తనతో పాటు రెండేళ్ల చిన్నారి ప్రాణాన్ని కూడా తీసుకెళ్లిపోయింది. ఫ్యామిలీలో గొడవలున్నంత మాత్రాన, భర్తతో మనస్పర్థలు వచ్చినంత మాత్రాన.. చావే పరిష్కారమా? అంతగా ఇబ్బంది ఉంటే.. పెద్దవాళ్లను కూర్చోబెట్టి మాట్లాడటమో, కౌన్సిలింగ్ తీసుకోవడమో చేయాలి గానీ.. ఇలా ప్రాణాలు తీసుకోవడమేంటి? చిన్న చిన్న సమస్యలకే ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఎందుకొస్తోంది? అనేదే.. ఎవ్వరికీ అంతుబట్టడం లేదు. తిరుపతిలో ఇంజనీరింగ్ చదువుతున్న 20 ఏళ్ల చందు అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తూర్పుగోదావరి జిల్లాలో.. తొర్రేడు తిరుమల కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఎల్ల సత్యదేవకుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్‌లో తండ్రి దించి వెళ్లిన కొన్ని గంటల్లోనే.. సూసైడ్ చేసుకున్నాడు. హాస్టల్‌లో ఉండనని, ఇంటి దగ్గరే ఉండి చదువుకుంటానని మారాం చేశాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో.. ఆత్మహత్యే శరణ్యం అనుకున్నాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోతే.. వారిని ఒప్పించే ప్రయత్నం చేయాలి. కూర్చోబెట్టి నచ్చజెప్పాలి. ఒకసారి కాకపోయినా.. మరోసారి వింటారు. కానీ.. హాస్టల్లోనే ఉండమన్నారనే బాధతో ప్రాణాలు తీసుకోవడమేంటి? చిత్తూరు జిల్లా సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ స్టూడెంట్ సూసైడ్ చిత్తూరు జిల్లాలో సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ స్టూడెంట్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడో అంతస్తు నుంచి దూకి చనిపోయాడు. కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిలిస్తున్నారు. ప్రతి ప్రశ్నకు సమాధానం ఉన్నట్లే.. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. ప్రతి చీకటి వెనుక.. ఓ వెలుగు రేఖ దాగి ఉంటుంది. సమస్య ఎలాంటిదైనా.. పరిష్కారం ఓపిగ్గా ఆలోచించి వెతుక్కోవాల్సింది మనమే. సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొని.. జీవితాన్ని గెలవాల్సిందే! కానీ.. దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న ఆత్మహత్యల పరంపర చూస్తుంటే.. సమాజం ఎటు వైపు పోతుందోనన్న భయం కలుగుతోంది. ప్రతి ఒక్కరూ.. చావే పరిష్కారమనే మూర్ఖపు ఆలోచనల నుంచి బయటకు రాకపోవడమే.. గుండెల్ని పిండేస్తోంది. ఇప్పటికే ఉన్న ఆత్మహత్యల ఆందోళనల్ని మరింత పెంచుతోంది. మరి.. దీనికేంటి పరిష్కారం? చాలా మందిలో సన్నగిల్లుతున్న ఆత్మవిశ్వాసం కారణాలు ఏవైనా కావొచ్చు.. సమస్య ఎలాంటిదైనా ఉండొచ్చు.. కానీ.. తీరిగ్గా ఆలోచిస్తే ప్రతి ప్రాబ్లమ్‌కి.. కచ్చితంగా సొల్యూషన్ దొరుకుతుంది. కానీ.. ఏదైనా సమస్య వస్తే.. దాన్ని తట్టుకునేంత ఆత్మవిశ్వాసం చాలా మందిలో సన్నగిల్లుతోంది. వరుస ఆత్మహత్యల్ని చూశాక.. అర్థమవుతున్నది ఇదే. మార్కులు తక్కువొచ్చాయని, ఎగ్జామ్‌లో ఫెయిలయ్యామని, ప్రేమలో విఫలమయ్యామని, ఆర్థికంగా నష్టపోయామని, సోషల్ మీడియాలో ట్రోల్స్, కుటుంబ కలహాలు, వేధింపులు.. ఇలా చెప్పుకుంటూ పోతే.. అనేక కారణాలున్నాయ్. జీవితంలో భాగంగా ఎదురయ్యే చిన్న ఫెయిల్యూర్‌కి కూడా.. జీవితమే అంతమైపోయినట్లు భావిస్తున్నారు. ప్రతి సమస్యకు.. ఇన్‌స్టంట్ రిలీఫ్ కావాలి. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా.. వెంటనే పరిష్కారం దొరికేయాలనుకుంటారు. సొల్యూషన్ కాస్త లేటైనా.. లైఫ్ ఎండింగ్ డెసిషన్ తీసేసుకుంటున్నారు. ఇతరుల జీవితాలతో పోల్చుకుంటూ.. తాము ఎందుకూ పనికిరామని నిరాశ చెందుతున్నారు. మిగతా వాళ్లలా.. తమ లైఫ్ ఎందుకు లేదని బాధపడుతుంటారే తప్ప.. వారి స్థాయికి ఎదగాలని అనుకోవడం లేదు. ఈ సోషల్ కంపారిజన్స్ కూడా.. సూసైడ్స్‌కి ఓ రీజన్‌గా కనిపిస్తోంది. చాలా మంది తమ సమస్యలకు పరిష్కారంపై దృష్టి పెట్టకుండా.. ఇతరులతో పంచుకోకుండా.. వాళ్లకు వాళ్లే కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎంతోమందిపై..వారు పెరిగిన కుటుంబ, సామాజిక వాతావరణం కూడా ప్రభావం చూపుతోంది.



పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి
అమరుల కుటుంబాలకు అండగా నిలుస్తాం

సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్, పోలీస్ కమిషనర్





నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 21 (డీకే చాటింపు): శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహరహం శ్రమిస్తూ అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెల కట్టలేనివని, సమాజం ఎల్లవేళలా వారికి రుణ పడి ఉంటుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య లు అన్నారు. విధి నిర్వహణలో భాగంగా సంఘ విద్రోహ శక్తులతో పోరాడుతూ, అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి కుటుంబాల త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని గుర్తు చేశారు. పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.పోలీస్ కమిషనర్ సాయి చైతన్యతో కలిసి పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళుల ర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణ విధుల్లో పోలీసులు అనునిత్యం నిమగ్నం అయి ఉంటారని అన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే అనేక సవాళ్లను తమ ప్రాణాలను పణంగా పెట్టి ధైర్యంగా ఎదుర్కొంటా రని అన్నారు. గత సంవత్సరం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అసాంఘిక శక్తుల చేతిలో ప్రమోద్ కుమార్ అనే సీసీఎస్ కానిస్టేబుల్ వీర మరణం పొందారని ఆవేదన వ్యక్తం చేశారు. ముంబైలో తీవ్రవాదు లు దాడి చేసిన సమయంలో వారిని ఎదుర్కొనేందుకు కానిస్టేబుల్ తుకారాం చూపిన ధైర్య సాహసాలు అనన్య సామాన్యమని ఈ సందర్భంగా గుర్తు చేసుకు న్నారు. పోలీసులు కేవలం శాంతి భద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా తప్పిపో యిన చిన్నారుల ఆచూకీ కనుగొని వారిని తల్లిదండ్రుల చెంతకు చేర్చడం, మహిళకు భద్రత కల్పించడం, అన్ని వర్గాల వారికి భరోసాగా నిలవడం వంటి విధులను సమర్థవంతంగా నిర్వహిస్తు న్నారని కొనియాడారు. పోలీసుఅమరు లకుటుంబాల కుప్రభుత్వం,జిల్లాయంత్రాంగం ఎల్లవేళలా అండగా ఉ ంటుందని భరోసా కల్పించారు. ఇందులో భాగంగానే కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేస్తామని అన్నారు. పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ, ఈ ఏడాది దేశవ్యాప్తంగా 154 మంది పోలీసులు అమరులయ్యా రని అన్నారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 1986 నుండి ఇప్పటివరకు 21 మంది పోలీసులు అసాంఘిక శక్తులతో పోరాడుతూ అసువులు బాశారని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా తమ కర్తవ్య నిర్వహణలో ఎల్లవేళలా పోలీసులు ముందంజలో నిలుస్తున్నారని అన్నారు.అమరులకుటుంబా ల కు పోలీసుశాఖఎల్లవేళలా చేదోడువాదోడుగా ఉంటుంద ని భరోసా కల్పించారు. ఇప్పటికే 11 మందికి ఇంటి స్థలాలు కేటాయించడం జరిగిందని, మిగతా పది కుటుంబాలకు వారు కోరిన మేరకు కామారెడ్డి, మాక్లూర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థలాలు కేటాయించేలా రెవెన్యూ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. అమరులైన పోలీసుల ప్రతి కుటుంబానికి స్థలంలభించేవరకు పట్టుదల తో పర్యవేక్షిస్తామని అన్నారు. అమరుల కుటుంబాలు తమ సాధకబాధకాలు తెలియజే సేందుకు వరుసలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేకం గా ఒక అధికారిని నియమిస్తా మనితెలిపారు.అంతేకాకుండా స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు అమరుల కుటుంబాలను స్వయంగా కలిసి వారి అవసరాల ను గుర్తిస్తారని తెలిపారు. జిల్లాలో విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబీకులకు జ్ఞాపికలు అందజేశారు. అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ఏ.సి.పి (ఎ.ఆర్) కృష్ణ, నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ , సిసిఎస్ , ట్రాఫిక్, సి.టి.సి ఏసీపీలు , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ , సీఐలు, ఎస్.ఐలు , పోలీసు సిబ్బంది , అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిరసన వాయిదా , వేడుకలు రద్దు

మామిడి సోమయ్య

డీకే చాటింపు ప్రతినిధి, (హైదరాబాద్): జర్నలిస్టుల సమస్యల పై ఈ నెల 28న ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) తలపెట్టిన "ఛలో ఢిల్లీ-జంతర్ మంతర్ నిరసన" కార్యక్రమాన్ని ఢిల్లీలో నెలకొన్న అవాంఛనీయ పరిణామాల దృష్ట్యా వాయిదా వేయడం జరిగిందని ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యుడు,తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలిపారు. అదేవిధంగా అదే రోజు ఢిల్లీలో వేలాది మంది పాత్రికేయులతో జరగాల్సిన ఐఎఫ్ డబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను కూడా రద్దు చేస్తూ, ఈనెల 28న దేశవ్యాప్తంగా తమ తమ రాష్ట్రాలలో ఎక్కడికక్కడ వేడుకలు జరుపుకోవాలని ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కమిటీ పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ లో ఇటీవల జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల సందర్భంగా వార్తల కవరేజ్ కోసం వెళ్ళిన జర్నలిస్టులపైన, ప్రత్యేకించి మహిళా జర్నలిస్టులపైన పోలీసులు జరిపిన దాడిని ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కమిటీ తీవ్రంగా ఖండిస్తూ, ఈ ఘటనను సుప్రీం కోర్టు సుమోటాగా స్వీకరించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిందని, అదేవిధంగా బాధిత జర్నలిస్టులకు ఐఎఫ్ డబ్ల్యూజే అండగా ఉండాలని సమావేశం నిర్ణయించిందని పేర్కొన్నారు.ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈ నెల 28వ తేదీన తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఐఎఫ్ డబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మామిడి సోమయ్య తెలిపారు.

ఈరోజు మనకు ఎంతో భావోద్వేకమైన రోజు
పోలీస్ అమరవీరుల సంస్మరణ దిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి





డీకే చాటింపు ప్రతినిధి,(హైదరాబాద్):ఈ రోజు మనందరికీ ఎంతో భావోద్వేగమైన రోజు.. పోలీస్ అమరులను స్మరించుకునే రోజని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.సమాజం కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరులకు ఆయన నివాళులు అర్పించారు.దేశవ్యాప్తంగా దేవ్ సింగ్, ప్రమోద్ కుమార్, గాజుల సౌమ్య విధి నిర్వహణలో మరణించారు. శాంతిభద్రతల పరిరక్షణలో వారి త్యాగాలను మరువలేం.అమరుల కుటుంబం ఒంటరి కాదు వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.రాష్ట్ర అభివృద్ధి శాంతి భద్రతల పరిరక్షణ ఎంతో ముఖ్యం. పోలీస్ శాఖలో మరో 5 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకున్నాం. 2028 లోగా పోలీస్ శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.గతంలో విధి నిర్వహణలో వీరమరణం పొందిన కానిస్టబుళ్ల కు రూ. 40 లక్షలు ఎక్స్గ్రేషియా ఉంటే దానిని ఏకంగా ? 1 కోటి పెంచామని వివరించారు.యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ను ప్రారంభించి హోమ్ గార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు వారి పిల్లలకు ఇందులో అవకాశం కల్పించామని రెవంత్ రెడ్డి ప్రస్తావించారు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయే హోంగార్డుల కుటుంబాలకు రూ.5 లక్షలు ఎక్స్గ్రేషియా అందిస్తున్నామని,10 లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశిస్తున్నానన్నారు. డ్రగ్స్, గంజాయి వ్యాప్తి అత్యంత ప్రమాదకరమని,యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా చూడాలని ఆయన సూచించరు.షీ టీమ్స్ సేవలను కొనసాగిస్తూ మహిళల భద్రతను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు.

ఆర్మూర్ అలైబలైలో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 21 (డికె చాటింపు):దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆర్మూర్ నియాకవర్గం అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో అలైబలై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు హిందూ బంధువులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విజయదశమి పండగ రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరి కుటుంబంలో విజయాలు చేకూర్చాలని హిందువులంతా ఐకమత్యంగా ఉండాలని పార్టీలకతీతంగా భవిష్యత్తులో పనిచేయాలని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి పిలుపునిచ్చారు. అనాదిగా వస్తున్న ఈ ఆచారం భావితరాల వారు కూడా పాటించాలని ఉద్దేశంతో ప్రతి పండుగని సామూహికంగా నిర్వహించడం హర్షనీయమని అభివర్ణించారు. ఐకమత్యమే మహాబలమని అందుకు హిందువులందరికీ మద్దతుగా ప్రతి ఒక్కరు పనిచేయాలని కోరారు. ఆర్మూర్ నియోజకవర్గంలో అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రజల అండదండలు ఉండాలని కోరారు. శక్తి వంచన లేకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానే ఈ సందర్భంగా అన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం కోసం అందించినట్లయితే మరింత అభివృద్ధికి దోహదం చేసిన వారు అవుతారని అన్నారు. ఈ అలాయి బలాయి కార్యక్రమంలో నియోజక వర్గంలోని నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టిఆర్ఎస్ బెల్లంపల్లి మండల అధ్యక్షులుగా కందుల స్వరాజ్...



బెల్లంపల్లి(డీకే చాటింపు)తెలంగాణ రక్షణ సేన (టి ఆర్ ఎస్) బెల్లంపల్లి మండల అధ్యక్షులు గా కందుల స్వరాజ్ నియామకం అయ్యారు. ఈ మేరకు టి ఆర్ ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట కవిత ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కందుల స్వరాజ్ మాట్లాడుతూ ఈ నియామకానికి కృషి చేసిన బెల్లంపల్లి ఇంచార్జి బోడ జనార్దన్, రాష్ట్ర నాయకులు సిద్ధం శెట్టి సాజన్ కు ధన్యవాదాలు తెలిపారు. మండలలంలో టి ఆర్ ఎస్ పార్టీ అభివృద్ధి కి కృషి చేస్తానని అన్నారు.

రావణదహన కార్యక్రమంలో పోచారం



డీకే చాటింపు,(బాన్స్ వాడ): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని బాన్సువాడ పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో నిర్వహించిన రావణదహన కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి గారు కుటుంబ సభ్యులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు గారు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి గారు, పోచారం సురేందర్ రెడ్డి గారు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాసుల విజయ పాల్గొన్నారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో వరుసగా 16వ సంవత్సరం నిర్వహించిన రావణదహన కార్యక్రమానికి బాన్సువాడ పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రావణ దహనంతో మినీ స్టేడియం పండుగ సందడితో కళకళలాడింది. అనం తరం బాన్సువాడ గ్రామీణ మండలంలోని తన స్వగ్రామమైన పోచారం గ్రామంలో హనుమాన్ మందిరం వద్ద జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీ పోచారం. గ్రామస్థులకు జమ్మి ఆకులను పంపిణీ చేస్తూ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

దసరా వేడుకల్లో కుటుంబాల స్నేహితుల అలాయి బలాయి





నిజాంబాద్ ప్రతినిధి అక్టోబర్ 21 (డీకే చాటింపు): విజయదశమి వేడుకలు వాడవాడలా గ్రామ గ్రామాన ఘనంగా జరుపుకున్నారు. షమీ పూజలు వివిధ ఆలయాలలో కమిటీలలో నిర్వహించి ఒకర్నకరు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. విజయదశమి ప్రతి కుటుంబంలో సుఖశాంతులను సౌభాగ్యాలను నింపాలని ఈ సందర్భంగా పండితులు పెద్దలు నాయకులు దుర్గామాత ను వేడుకున్నారు. నగరంలోని గణేష్ నగర్ కాలనీలో బోర్గంలో ఆర్య నగర్ లో ఆనవాయితీగా వస్తున్న అలాయి బలాయి కార్యక్రమం నిర్వహించుకున్నారు. షమీ ఆకు జంబి ఆకు లతో ఒకరికి ఒకరు ఇచ్చుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.

కే టి ఆర్,హరీష్ రావు లను మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన మాజీఎమ్మెలీ గణేష్ బిగాల...



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 21 (డీకే చాటింపు): విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ రామారావు ,సీనియర్ నాయకులు, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావులను నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అం దజేసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.



పోలీసు అమరవీరుల త్యాగాలు

చిరస్మరణీయం:జిల్లా ఎస్పీ డాక్టర్ జి.వినీత్

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఘనంగా నివాళులు... -అమరుల త్యాగాలు వెల కట్టలేనివి... -ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి... -ర్యాలీ కార్యక్రమంలో "జోహార్ పోలీసు అమరవీరులకు జోహార్" నినాదాలు... - నారాయణపేటలో ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం...







నారాయణపేట,(డీకే చాటింపు): విధి నిర్వహణలో,దేశ అంతర్గత భద్రతతో పాటు ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ డాక్టర్ జి.వినీత్ అన్నారు.పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం(పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం నారాయణపేట జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు.జిల్లా ఎస్పీ డాక్టర్ జి.వినీత్ అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్,డీఎస్పీ నల్లపు లింగయ్యతో పాటు పోలీసు అధికారులు, అమరుల కుటుంబ సభ్యులు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. ప్రజల రక్షణ,దేశ అంతర్గత భద్రత,ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణతో పాటు శాంతిభద్రతల నిర్వహణలో పోలీసు వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తక్షణమే స్పందించి పరిస్థితులను అదుపులోకి తీసుకురావడంలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని పేర్కొన్నారు.ప్రపంచమంతా నిద్రిస్తున్న వేళ పోలీసులు మేల్కొని ప్రజల భద్రత కోసం నిరంతరం కాపలా కాస్తారని, ఎండ,వాన,పగలు,రాత్రి అనే తేడా లేకుండా విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవాల్సిన పండుగలు ,ప్రత్యేక సందర్భా లను సైతం త్యజించి ప్రజల రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తారని చెప్పారు.విధి నిర్వహణలో తమ ప్రాణాలను పణంగా పెట్టి వీరమరణం పొందిన పోలీసుల త్యాగాలను స్మరించుకోవడం,వారికి గౌరవం చూపించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. 1959 అక్టోబర్ 21 న,లడఖ్ ప్రాంతంలో దేశ సరిహద్దుల రక్షణ విధుల్లో ఉన్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు చైనా సైనికులతో పోరాడుతూ ప్రాణాలర్పించిన ఘటనను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 న,దేశవ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు.విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు యోధుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ,వారి సేవలను భావితరాలకు తెలియజేయడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థ పటిష్టంగా ఉన్నప్పుడే సమాజంలో శాంతి,స్థిరత్వం నెలకొని అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరుతాయని ఎస్పీ అన్నారు.ప్రజల ప్రశాంత జీవనానికి తమ జీవితాలను అంకితం చేసిన అమరవీరుల త్యాగాలకు వెలకట్టలేమని పేర్కొన్నారు.ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ఉగ్రవాదులు, సంఘవిద్రోహ శక్తులతో జరిగిన పోరాటాల్లో 154 మంది పోలీసులు అమరులయ్యారని తెలిపారు.

వీరమరణం పొందిన రాజారెడ్డి కుటుంబానికి అండ

నారాయణపేట జిల్లాలో అంతర్గత భద్రత పరిరక్షణ విధుల్లో భాగంగా 2005లో కానిస్టేబుల్ రాజారెడ్డి వీరమరణం పొందారని గుర్తు చేశారు. ఆయన కుటుంబానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.పోలీసుల త్యాగనిరతిని నిరంతరం స్మరించుకుంటూ,వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.అక్టోబర్ 21 నుంచి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి,జాతీయ ఐక్యత దినోత్సవమైన అక్టోబర్ 31వరకు పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకునేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి సావర్కర్ చౌరస్తా మీదుగా సత్యనారాయణ చౌరస్తా వరకు,అక్కడి నుంచి తిరిగి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు పోలీసులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భం గా"జోహార్ పోలీసు అమరవీరులకు జోహార్" అంటూ నినాదాలు చేస్తూ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.అదనపు ఎస్పీ ఎం.డి.రియాజ్ ఉల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, పరేడ్ కమాండర్ ఆర్ఐ విజయ్ భాస్కర్,సీఐలు



రామ్ లాల్,భగవంత్ రెడ్డి, సైదులు,ఎస్సైలు ఏ. వెంకటేశ్వర్లు,నరేష్, పురుషోత్తం,బాలరాజు,రాజు ,రమేష్,సునీత,అశోక్ బాబు ,ఆర్ఎస్ఐలు శివశంకర్, శిరీషతో పాటు ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆ..నేతలకు భరోసాతోనే కాలయాపన...!?మంచి రోజులు ఎప్పుడో..!!

-జెండాలు మోసిన భుజాలు కందిపోయాయి.. -జెండాలు పట్టిన చేతులు నీరసించాయి..!! -మరి సముచిత స్థానం ఎప్పుడో..!? - నారాయణపేట అధికార పార్టీలో తాజా వాతావరణం... "డీకే చాటింపు ప్రత్యేక కథనం" ...



నారాయణపేట,(డీకే చాటింపు): జెండాలు మోసిన భుజాలు కందిపోయాయి..!సీట్ల దగ్గరికి వచ్చేసరికి కార్యకర్తల కష్టాలు కనుమరుగయ్యాయి..!?

పార్టీ కోసం తిరిగిన కాళ్లు అలసిపోయాయి..!జెండాలు పట్టిన చేతులు నీరసించాయి..!!కానీ ఎన్నికల వేళ సీటు దగ్గరకు వచ్చేసరికి డబ్బు, పలుకుబడి ఉన్నవారికే ప్రాధాన్యమా..!? చివరకు నామినేటెడ్ పదవుల్లోనైన తగు ప్రాధాన్యత లభిస్తుందా..!లేదా..?అనేది ప్రస్తుతం అధికార పార్టీలో నెలకొన్న సందేహాలు ఎన్నెన్నో..!

ఆ..విజయంతో తమకు మంచి రోజులు వచ్చాయని..కానీ..!?

ఆ..విజయంతో తమకు మంచి రోజులు వచ్చావని ఆశించిన అధికార పార్టీ శ్రేణులకు ప్రస్తుతం అయోమయం నెలకొంది.ఈ వ్యవహారం ఎక్కడో జరుగుతుందని ఎవరైనా అనుకుంటే బురదలో కాలేసినట్లే..!నారాయణపేట అధికార పార్టీలో తాజాగా నెలకొన్న పరిస్థితి.!అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. విజయం సాధించారు.!ఈ విజయంతో తమకు మంచి రోజులు వచ్చేవని నాటి ఫలితాల రోజే అందరి మొహాల్లో చిరునవ్వు దృశ్యాలు కానరాగా..అదే నేతల మొహాల్లో ప్రస్తుతం నిరాశ కానవస్తున్నాయి. అందు కారణం..పార్టీలోని ముఖ్య నేతలకు ఎమ్మెల్యే, అధినేత భరోసా ఇచ్చిన ప్రస్తుతం నెరవేరకపోవడమే. ఈ నేపథ్యంలో తమ రాజకీయ భవిష్యత్తు ఏ విధంగా ఉండబోతుందనే సందేహాలను తమ ఆప్తులు, ఆత్మీయులు,కుటుంబ సభ్యులతో చర్చించుకుంటూ రోజులు గడుపుతున్నారు. అవును..అధినేత వచ్చారు కదా..ఏం సమాచారం తెచ్చావు..అని పైవారు అడిగితే..బిజీగా ఉన్నారు. మనుసు పెట్టి మాట్లాడలేదు. కుశలంగా మాట్లాడలేకపోయాను అనే సమాధానాలు వస్తున్నట్లు సమాచారం.ఈ విధమైన వాతావరణంలో తమకు సముచితస్థానం ఎప్పుడూ లభిస్తుందో అని భూతద్దంలో చూడవలసి వస్తుందని వారి సన్నిహితులు హేళనగా మాట్లాడుతున్నట్లు పార్టీలో గుసగుసలు వినపడుతున్నాయి.దాంతో ముఖ్య నేతల పరిస్థితి ప్రస్తుతం అయోమయంగా నెలకొని ఉంది.భరోసా కల్పించిన నేతలకు త్వరగా సముచిత స్థానం కల్పించినట్లయితే పార్టీలో సర్వత్ర హర్షం వ్యక్తమౌతుంది. ఎమ్మెల్యే ఎన్నికల తర్వాత గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికలు జరిగాయి.గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆయా గ్రామాల నేతలు తీవ్రంగా కష్టపడి విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తమకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని ఎన్నో కలలు కన్నా ముఖ్య నేతలకు చివరకు మొండి చెయ్యి అందింది.దాంతో ముఖ్య నేతలు,పార్టీ శ్రేణులు కంగు తిన్నారు.నారాయణపేట మున్సిపాలిటీలో 24వార్డుల్లో

కాంగ్రెస్-7,ఎంఐఎం-2, బీఆర్ఎస్-2,ఇండిపెండెంట్లు 2(10వ,వార్డు,11వ,వార్డు ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ),బిజెపి- 11వార్డులను గెలుచుకున్నాయి.

ఏళ్ల తరబడి పార్టీ జెండాలు మోస్తున్న...

ఏళ్ల తరబడి పార్టీ జెండాలు మోస్తూ..నాయకుల వెంట నడుస్తూ..సభలు, సమావేశాలు,ర్యాలీల కోసం తమ సమయాన్ని,శ్రమను వెచ్చించిన కార్యకర్తల పరిస్థితి నేడు ప్రశ్నార్థకంగా మారుతోంది..!?పార్టీనే కుటుంబంగా భావించి, కష్టనష్టాల్లో అండగా నిలిచిన సాధారణ కార్యకర్తకు ఎన్నికల సమయంలో గుర్తింపు దక్కుతోందా..!? అంటే అది జరగలేదు.పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన కార్యకర్త ఒకవైపు..ఎన్నికల సమయం దగ్గరపడగానే డబ్బు,పలుకుబడితో పార్టీ మారి టికెట్ ఆశించే నాయకులు మరోవైపు..!ఈ రెండింటి మధ్య కార్యకర్తల త్యాగాలకు విలువ ఎంత అన్న ప్రశ్న తలెత్తుతోంది.

పార్టీనే నమ్ముకున్న కార్యకర్త పరిస్థితి...!

డబ్బుంటే పార్టీ మారడం సులభం..పలుకుబడి ఉంటే సీటు కోసం ప్రయత్నించడం సులభం..!?మరి పార్టీనే నమ్ముకుని ఏళ్ల తరబడి పనిచేసిన కార్యకర్త పరిస్థితి ఏమిటి..!?ఎన్నికల సమయంలో కార్యకర్తల అవసరం ఎంతో ఉంటుంది. ఇంటింటి ప్రచారం చేయాలి. జనాన్ని సమీకరించాలి,నాయకుల కోసం పరుగులు తీయాలి. కానీ టికెట్ల కేటాయింపు దగ్గరకు వచ్చేసరికి వారి సేవలు,అనుభవం, అంకితభావం పక్కన పడిపోతున్నాయనే అసంతృప్తి పలువురిలో కనిపిస్తోంది.పార్టీ కోసం జీవితంలో విలువైన సంవత్సరాలను వెచ్చించినవారు అవకాశాల కోసం ఎదురుచూస్తుంటే, ఆర్థిక బలం,రాజకీయ పలుకుబడి ఉన్నవారు ముందుకు రావడం పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యంపై చర్చకు దారితీస్తోంది.టికెట్ రాకపోతే కొందరు మరో పార్టీ వైపు అడుగులు వేస్తారు.. మరికొందరు నిరాశతో రాజకీయాలకు దూరమవుతారు..! ఇంకొందరు తమకు ఎప్పటికైనా గుర్తింపు వస్తుందనే ఆశతో మళ్లీ జెండా పట్టుకుని నడుస్తూనే ఉంటారు..! కార్యకర్త చెమటకు విలువ లేదా..!?

కార్యకర్త చెమటకు విలువ లేదా..!? జెండా మోసిన భుజానికి గుర్తింపు లేదా..!? పార్టీ కోసం జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తికి రాజకీయ భవిష్యత్తు లేదా..!?ప్రజాస్వామ్యంలో పార్టీలు బలపడాలంటే కేవలం ఆర్థిక వనరులు, ఎన్నికల వ్యూహాలు మాత్రమే సరిపోవు.క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమయ్యే కార్యకర్తలకు గౌరవం, బాధ్యతలు,తగిన అవకాశాలు కల్పించడం కూడా అంతే ముఖ్యం.టికెట్ల కేటాయింపులో సేవ,ప్రజల్లో ఉన్న ఆదరణ,సామర్థ్యం, పార్టీ పట్ల అంకితభావం వంటి అంశాలకు పారదర్శకమైన ప్రాధాన్యం ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తోంది. లేకపోతే ఏళ్ల తరబడి పార్టీని మోసిన కార్యకర్తలు నిరాశలో మిగిలిపోతారు.అవకాశాల కోసం కొత్తగా వచ్చినవారు ముందుకు సాగుతారు. అప్పుడు రాజకీయాల్లో నిబద్ధతకు విలువ తగ్గుతోందనే భావన మరింత బలపడుతుంది.జెండాలు మోసిన భుజాలు కందిపోతున్నాయి..పార్టీ కోసం తిరిగిన కాళ్లు అలసిపోతున్నాయి..మరి కార్యకర్తల కష్టాలకు గుర్తింపు ఎప్పుడు..!?ఇదే నేటి రాజకీయాల్లో కార్యకర్తల భవిష్యత్తుపై ఆలోచించాల్సిన ప్రశ్న..!?





భారత్‌కు తలనొప్పిగా బంగ్లా పరిణామాలు..!

ఏదేశాన్ని తిన్నగా బతకనీయకుండా ఆటలాడడం అమెరికాకు అలవాటుగా మారింది. అన్ని దేశాలపైనా ఆంక్షలు విధించడం, మోయలేని సుంకాలు విధించడం, బెదిరించడం పరిపాటిగా మారింది. తాజాగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే, 500 శాతం పన్నులు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిం చారు. ప్రపంచ దేశాలన్నీ తన కనుసన్నల్లో ఉండాలన్న కోరిక అమెరికాలో బలంగా నాటుకుంటోంది. అందుకు అవసరమైన అన్ని కుయుక్తులు పన్నుతోంది. ఒక్కో దేశంలో వేలుపెడుతూ వాటిని కంట్రోల్ చేస్తోంది. ఇజ్రాయిల్‌ను అడ్డం పెట్టుకుని పాలస్తీనాపై దాడికి తెగించింది. ఇరాన్, ఖతార్‌లపైనా విరుచుకు పడింది. అలాంటి అవకాశం లేని చోట్ల రాజకీయంగా వేలుపెట్టి అక్కడున్న పాలకులను మార్చేస్తోంది. ఒక్క భారత్‌లోనే అది సాధ్యం కావడం లేదు. చైనాలో అస్సలు సాధ్యం కాదు. భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం కావడం, విభిన్న మతాలు, కులాల సమాహారం కావడంతో ఇక్కడ దాని పప్పులు ఉడకలేదు. ఇక్కడా రకరకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇటీవలి వరుస ఆందోళనలు చూస్తుంటే సిఐఏ బాగా పని చేస్తోందన్న విమర్శ లు ఉన్నాయి. మన పక్కనే ఉన్న బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వాన్ని గద్దె దించడంలో పరోక్షంగా అమెరికా పాత్ర ఉంది.నేపాల్‌లో గొడవలు సృష్టించారు. భారత్‌ను దెబ్బతీసేందుకు చుట్టుపక్కల దేశాల్లో అలజడులు సృష్టిస్తు న్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ఆంక్షలు విధించారు. వీసాల విషయంలో అనేక రకాల నిబంధలను పెట్టారు. బంగ్లాదేశ్‌నే తీసుకుంటే అక్కడా అలజడుల వెనక అమెరికా హస్తం ఉందని అంతర్జాతీయ నిపుణులు ఆరోపిస్తు న్నారు. ఇంటిలిజెన్స్ చీఫ్ తులసీగబ్బార్ ఆమధ్య అంగీకరించారు. అయినా వెనకటి గుణమేల మారు అన్న చందంగా అమెరికా పరిస్థితి ఉంది. బంగాదేశ్‌లనే తీసుకుంటే అక్కడ హసీనాను గద్దె దించడం, యూనస్‌ను గద్దెనెక్కిం చడం చకచకా జరిగి పోయాయి. ఇప్పుడు హసీనాకు ఉరిశిక్షను కూడా విధించారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం రసాయన ఆయుధాల పేరుతో ఇరాక్‌పై దాడిచేసి అక్కడ సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని అమెరికా గద్దె దింపింది. అలాగే సద్దాంను విచారణ పేరుతో బంధించి ఉరితీసే వరకు నిద్రపోలేదు.

న్యూక్లియర్ ఫ్యూజన్ లో భారత్ ముందడుగు

విజయవాడ, : న్యూక్లియర్ ఫ్యూజన్ ఎనర్జీ రంగంలో భారత్ మరో మైలురాయిని అధిగమించింది. సూర్యుడి కేంద్రం కన్నా 20 రెట్ల వేడి ప్లాస్మాను సృష్టించారు. గుజరాత్‌లోని ప్లాస్మా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐపీఆర్)కు చెందిన ఎూ-1 టోకామాక్‌పై కొత్త శక్తివంతమైన గైరోట్రాన్ వ్యవస్థను విజయవంతంగా ప్రారంభించారు. ఇది 82.6 గిగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ, 400 కిలోవాట్ల సామర్థ్యంతో పనిచేస్తుంది. టోకామాక్‌లోని అత్యంత వేడి ప్లాస్మాను మరింత వేడి చేయడానికి ఈ కొత్త పరికరం ఉపయోగపడుతుంది.స్టడీ స్టేట్ సూపర్‌కండక్టింగ్ టోకామాక్(ఎూ-1) అనే పరికరం, నియంత్రిత పద్ధతుల్లో సూర్యుడిపై జరిగే న్యూక్లియర్ ఫ్యూజన్ ప్రక్రియను నిర్వహిస్తుంది. టోకామాక్‌లోని బలమైన అయస్కాంత క్షేత్రం ప్లాస్మాను నియంత్రిస్తుంది. తాజా పరిశోధనల్లో ప్లాస్మా ఉష్ణోగ్రత 20 కోట్ల డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా చేరింది. ఇది సూర్యుడి కేంద్రంలో ఉత్పత్తి అవుతున్న వేడి కన్నా దాదాపు 10-20 రెట్లు ఎక్కువ.గైరో ట్రాన్ అనేది అధిక ఫ్రీక్వెన్సీ మైక్రోవేవ్ శక్తిని ఉత్పత్తి చేసే ప్రత్యేక పరికరం. ఈ శక్తిని టోకామాక్‌లోని ప్లాస్మాలోకి పంపించడం ద్వారా దాని ఉష్ణోగ్రతను మరింత పెంచుతారు. ఎూ-1లో ఇంతకుముందు 42 గిగాహెర్ట్జ్ జైరోట్రాన్ వ్యవస్థను ఉపయోగించారు. ఇప్పుడు ఏర్పాటు చేసిన 82.6 గిగాహెర్ట్జ్ వ్యవస్థ అధిక సామర్థ్యంతో ప్లాస్మాను వేడి చేయడానికి సహాయపడుతుంది.ఫ్యూజన్ ప్రక్రియలో ప్లాస్మాను అత్యంత వేడికి చేర్చడమే కాకుండా, దానిని తగిన సమయం పాటు స్థిరంగా ఉంచడం కూడా అత్యంత కీలకం. కొత్త గైరో ట్రాన్ ఈ ప్రయోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సైంటిస్టులకు ఉపయోగపడింది.ఫ్యూజన్ (కేంద్ర సంలీన చర్య) ముఖ్యంగా సూర్యుడి వంటి నక్షత్రాల్లో జరుగుతుంది. దీని వల్ల అపారమైన శక్తి వెలువడుతుంది. అవుతుందిప్రస్తుతం సాంప్రదాయ అణు విద్యుత్ కేంద్రాల్లో జరిగే న్యూక్లియన్ ఫిజన్(కేంద్ర విచ్ఛత్తి చర్య) వల్ల యురేనియం లేదా ప్లూటోనియం ఢీకొట్టుకోవడం వల్ల చిన్న కేంద్రకాలుగా విడిపోతుంది. దీని వల్ల శక్తి విడుదల అవుతుంది. ఫిషన్‌తో పోలిస్తే ఫ్యూజన్ చర్యలో దీర్ఘకాలికంగా నిల్వ చేయాల్సిన రేడియోధార్మిక వ్యర్థాల సమస్య తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది.

కాలుష్య కోరల్లో సిటీ శివార్లు



వ్యర్థ జలాలతో నిండిపోతున్న ఖాళీ స్థలాలు

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ శివార్లు మరింత విస్తరిస్తున్నా యి. అంతే వేగంగా శివారు ప్రాంతాల్లో పెద్ద పెద్ద రెస్టారెంట్లు, హోటళ్లు, పబ్‌లు వెలుస్తున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు, కన్వెన్షన్ హాళ్ల నుంచి ఆహార వ్యర్థాలతో పాటు వ్యర్థ జలాలు కూడా భారీ మొత్తంలోనే ఉత్పత్తి అవుతున్నాయి. వ్యర్థాలను ప్రాసెసింగ్ చేయకుండా ఇష్టారీతిన బహిరంగ ప్రదేశాల్లోకి వదులుతున్నారు. ఎక్కడా నిబంధనలు పాటించకుండా పరిసర ప్రాం తాలను కలుషితం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని హోటళ్లు, రెస్టారెం ట్లు వదులుతున్న వ్యర్థాలతో పరిసరాలన్నీ మురుగుతో నిండిపోతున్నా యి. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతూ పరిసర ప్రజల తో పాటు వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హోట ళ్లు, రిసార్ట్స్, రెస్టారెంట్లు, పబ్‌ల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా భూమి, గాలి కాలుష్యానికి పాల్పడుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి, పురపాలక శాఖల అధికారులు కనీస తనిఖీలు నిర్వహించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నా యి. కోట్లాది రూపాయలతో ఏర్పాటుచేసిన హోటళ్లలో కనీసం ఎస్టీపీలు,సెప్టిక్ ట్యాంకులు నిర్మించు కోవడం లేదు. సెప్టిక్ ట్యాకులు, ఎస్టీపీలు లేకున్నా సంబంధిత అధికా రులు నిర్వహణకు అనుమతులెలా ఇచ్చారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ మహానగరం మరింతగా విస్తరించింది. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పరుగులు పెట్టడంతో రియల్ ఎస్టేట్ రంగం ఉరకలేసింది. దీంతో నగరం నలువైపులా గణనీయంగా విస్తరించింది. ఈ నేపథ్యంలో శివారు ప్రాంతాల్లో హైరేజ్ అపార్ట్‌మెంట్లు, వరల్డ్ క్లాస్ రెస్టారెంట్లు, రిసార్ట్స్ ఏర్పాటు ఊపందుకోవడంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం శివార్లలోకి నాలా కనెక్షన్ అవసరం లేదని, ఎక్కడికక్కడ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. దీంతో శివారు ప్రాంతాల్లోని అన్ని బహుళ అంతస్తుల్లో ఎస్టీపీలను నిర్మించుకుంటున్నారు. అదేవిధంగా హోటళ్లు, రెస్టారెంట్లలో కూడా ఎస్టీపీలు నిర్మించుకుని వ్యర్థాలను ప్రాసెస్ చేయాలని ప్రభుత్వ అధికారులు ఆదేశించారు. కానీ కొంతమంది అక్రమార్కులు హోట ళ్లు, రిసార్ట్స్, రెస్టారెంట్లు, పబ్బుల్లో ఎస్టీపీలు ఏర్పాటు చేసుకోకుండా పైపుల ద్వారా వ్యర్థాలను చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాల్లోకి వదులుతున్నారు. దీంతో ఆ ప్రాంతాలన్నీ కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతూ భూమి, గాలి కాలు ష్యం ఏర్పడుతున్నది. వర్షాకాలంలో పరిస్థితి మరింత తీవ్రతరమ వుతున్నది. శివారు ప్రాంతాల్లో ఎక్కువగా వివాదాల నడుమ ఉన్న భూములు కోర్టు కేసుల వల్ల ఖాళీగా ఉండటంతో అందులోకి యథేచ్ఛగా వదులుతున్నారు. అధికారులు కూడా చూసీచూడన ట్లు వ్యవహరిస్తు న్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఔటర్ రింగ్‌రోడ్డు పరిస రాల్లో ఈ పరిస్థితులు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. నగరానికి చుట్టూ ఇదే తంతు కొనసాగుతున్నా జీహెచ్ఎంసీ, కాలుష్య నియంత్రణ మండలి, జల మండలి అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి ఎస్టీపీ లులేని హోటళ్లు, రెస్టారెంట్లు, రిసార్ట్స్, పబ్‌లపై చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు. లేదంటే శివారు భూములన్నీ కాలుష్య కోరల్లో చిక్కుకుంటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దొడ్డుబియ్యం అమ్మకం సవాలే!



నల్గొండ: తెలంగాణ ప్రభుత్వానికి దొడ్డు బియ్యాన్ని వేలం వేయడం సవాల్‌గా మారింది. గోదాములు, రేషన్ షాపుల వద్ద నిల్వ ఉన్న దొడ్డు బియ్యం విక్రయానికి సివిల్ సప్లయ్ శాఖ టెండర్ పిలిచినా.. ఒక్క కంపెనీ కూడా ముందుకు రావడం లేదు. వేలం వేయడం ఆల స్యమైన కొద్దీ నష్టం కూడా పెరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో దొడ్డు బియ్యం విక్రయానికి మరోసారి టెండర్‌ను ఆహ్వానించి.. త్వరగా విక్రయించాలని సంబం ధిత శాఖ అధికారులు ఆలోచన చేస్తున్నారు. తెలంగాణ పర్యాటకం రెండోసారి ఆహ్వానించే టెండర్‌లో.. కిలో బియ్యం ధరను కొంత తగ్గించాలనే ఆలోచనలో ఉన్నట్లుగా సమాచారం. సర్కార్ నుంచి అనుమతి రాగా నే.. టెండర్ ఆహ్వానించా లనే యోచనలో ఉన్నట్లుగా అధికారులు చెబుతున్నారు. గతేడాది ఏప్రిల్‌లో ఉగాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా తెల్ల రేషన్ కార్డులున్న వినియోగదా రులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. అప్పటి వరకు రాష్ట్రంలో 1.40 లక్షల మెట్రిక్ ట న్నుల దొడ్డు బియ్యం మిగిలింది. ఈ బియ్యం విలువ సుమారుగా రూ.500 కోట్ల వరకు ఉంటుందని సివిల్ సప్లయ్ శాఖ అంచనా వేసింది. మిగిలిపోయిన ఈ దొడ్డు బియ్యం టెండర్ ద్వారా విక్రయించా లని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే గత నెలలోనే పేరుకుపోయిన దొడ్డు బియ్యానికి సివిల్ సప్లయ్ శాఖ టెండర్‌ను ఆహ్వానించినా.. ఒక్క టెండర్ కూడా రాలేదు. దీంతో దొడ్డుబియ్యం కొనుగోలు కోసం టెండర్లు వస్తే గత మంగళవారమే తెరవాలి. కానీ ఒక్క టెండర్ కూడా రాకపోవడం తో.. మరోసారి టెండర్లను ఆహ్వానా నికి కసరత్తు చేస్తున్నారు.అయితే దొడ్డు బియ్యం కొనుగోలుకు మొదటి సారి బిడ్డర్లు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం మొత్తం నిల్వగా ఉన్న 1.40 లక్షల టన్నులను ఒకే లాట్ కింద పెట్టడమే ఇబ్బందికరంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఈ టెండర్‌క్ పెద్ద బిడ్డర్లు రాకపోవడం, చిన్నబిడ్డర్లు పాల్గొనే అవకాశం లేక పోవడం ప్రధాన కారణమని చెబుతున్నారు. కనీసం చిన్న లాట్లుగా ఏర్పాటుచేసి టెండర్ ఆహ్వానిస్తే ఎక్కువ సంఖ్యలో బిడ్డర్లు పాల్గొనే అవకాశం ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.అంతేకాకుండా వేలం వేయా లనుకున్న బియ్యం ధరను కిలో రూ.24గా సివిల్ సప్లయ్ శాఖ ముందే నిర్ణయించడం కూడా బిడ్డర్లు ముందుకు రాకపోవడానికి ప్రధానకారణ మని చర్చ ఉంది. వేలం వేయాలనుకుంటున్న దొడ్డురకం బియ్యం అప్పటికే పాతపడటం, సగానికిపైగా పురుగులు పట్టి నాణ్యత లోపించి ఉండటంతో ఆ ధర మరీ ఎక్కువ అని బిడ్డర్లు అభిప్రాయపడిన ట్టు తెలిసింది. ఇది సివిల్ సప్లయ్ శాఖ అధికారుల నిర్లక్ష్యం, ముందుచూ పులేని వి ధానంతోనే సర్కార్‌కు ఆర్థికంగా తీవ్రనష్టం చేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండోసారి ఆహ్వానించే టెండర్లలో మార్పు లు చేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఏప్రిల్ నుంచి రేషన్ కార్డు దారులకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణి చేస్తుందని తెలిసినా.. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి దొడ్డుబియ్యాన్ని సరఫరా చేశారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన తేదీ మేరకు ఏప్రిల్ నెలలోనే ఉ గాది పండుగ రోజునే సన్న బియ్యం పంపిణీ ప్రారంభించడంతో.. గోదాముల్లో 1.4 లక్షల టన్నుల బియ్యం, రేషన్‌షాపు డీలర్ల వద్ద 40 వేల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలుగా పేరుకుపోయినాయి.రేషన్‌షా పుల్లోని బియ్యం పందికొక్కులు బుక్కి, ముక్కిపోయి పాడైపోతు న్నాయని, వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని డీలర్లు అధికారులు ఇప్పటికే అనేకసార్లు ఫిర్యాదులు చేశారు. అధికారుల ఉదాసీనత వల్లే 10 నెలలుగా రూ.500 కోట్ల విలువైన బియ్యం అటు రేషన్‌దుకాణాలు, ఇటు గోదాముల్లో మూలుగుతున్నట్లుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దొడ్డుబియ్యాన్ని వేలం వేయాలని అప్పటి సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ చౌహాన్ ఉత్తర్వులు జారీచేసినా టెండర్ పట్టాలెక్కడానికి 4నెలలు పట్టడం గమనార్హం. అధికారులు ముందుగా స్టాక్ నిలిపేసి నా, లేదంటే స్టాక్‌ను వెంటనే వేలంలో అమ్మినా సివిల్ సప్లయ్‌కు భారీనష్టం తప్పేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎవరీ సృజన్ రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు వినిపిస్తున్న అత్యంత వివాదాస్పదమైన, ఆసక్తికరమైన పేరు సూదిని సృజన్ రెడ్డి. ప్రతీ దానికి సృజన్ రెడ్డి పేరును తెరపైకి తెస్తున్న బీఆర్ఎస్.. రేవంత్ పై ఆరోపణలు చేస్తోంది. కానీఈ సృజన్ రెడ్డి బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ కాంట్రాక్టులు పొందారని డీటైల్స్ వెలుగులోకి వచ్చాయి.సూదిని సృజన్ రెడ్డికి కేవలం ఒక వ్యాపారవేత్తగానే కాకుండా, అధికార పార్టీ ఏదైనా తన హవాను కొనసాగించగల వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉ ంది. సృజన్ రెడ్డికి ఉన్న రాజకీయ సంబంధాల చార్ట్ చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఆయన మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కందాల ఉ పేందర్ రెడ్డికి అల్లుడు కాగా, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భార్య వైపు నుంచి ఆయనకు కాస్త దూరం బంధుత్వం ఉంది. ఇలా అటు ప్రతిపక్షం, ఇటు అధికార పక్షం రెండింటితోనూ ఆయనకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.సృజన్ రెడ్డి పేరు మొదట ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ప్రాచరంలోకి వచ్చింది. ఈ కేసులో ఈడీ, సిబిఐ సోదాలు జరిగినప్పుడు ఆయన పేరు ప్రముఖంగా వినిపించింది. అప్పట్లో బీఆర్ఎస్ అగ్రనేతలకు అత్యంత సన్నిహితుడిగా, ఆ పార్టీ ఆర్థిక మూలాల్లో కీలక వ్యక్తిగా ఆయనపై ఆరోపణలు వచ్చాయి. రాజకీయ వర్గాల్లో కొందరు ఆయన్ని ఒక చిన్న చేపగా అభివర్ణిస్తే, మరికొందరు మాత్రం తెరవెనుక చక్రం తిప్పే "కింగ్‌పిన్" అని విశ్లేషిస్తుంటారకాంట్రాక్టుల విషయానికి వస్తే, సృజన్ రెడ్డికి చెందిన సంస్థలు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భారీ ప్రాజెక్టులను దక్కించుకున్నాయి. ముఖ్యంగా మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టుల్లో ఆయన సంస్థలు కీలక పాత్ర పోషించాయి. అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వంతో ఉన్న సాన్నిహిత్యం వల్ల వేల కోట్ల విలువైన పనులు ఆయనకు దక్కాయని విపక్షాలు ఆరోపించేవి. అయితే, ప్రభుత్వం మారిన తర్వాత కూడా సృజన్ రెడ్డి హవా తగ్గకపోవడం గమనార్హం.

ఏపీలో రాజ్యసభ రేస్..!

అమరావతి, : ఏపీలో రాజ్యసభ ఎన్నికల సందడి మొదలైంది. అంతకంటే ముందే వారి స్థానంలో కొత్తవారి ఎన్నిక జరగనుంది. అయితే కూటమికి స్పష్టమైన బలం ఉండడంతో.. ఆ నాలుగు స్థానాలు కూటమి పార్టీలకే దక్కనున్నాయి. వైసిపి కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితం కావడంతో ఆ పార్టీకి ఛాన్స్ లేదు. ఆ పార్టీ పోటీ చేయదు కూడా. ప్రస్తుతం వైసీపీకి ఏడుగురు ఎంపీలు ఉన్నారు రాజ్యసభలో. అయితే ముగ్గురు ఖాళీ కానుండడంతో నలుగురు సభ్యులు మిగలనున్నారు. అయితే కూటమి పార్టీలో మాత్రం చాలా మంది ఆశావహులు ఉన్నారు. ఎవరి ప్రయ త్నాల్లో వారు ఉన్నారు.ఈ ఏడాది జూన్లో ఏపీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన సానా సతీష్, వైసీపీకి చెందిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ నత్వాని పదవీ విరమణ చేయనున్నారు. వారి స్థానంలో కొత్త వారి ఎంపిక అనివార్యం. ఏడాది కిందట సాన సతీష్ టిడిపి తరఫున గెలవడంతో ఆయనకు రెన్యువల్ చేయనున్నారు. అయితే మిగతా మూడు స్థానాల్లో తెలుగుదేశం పార్టీ ఎన్ని స్థానాలను తీసుకుంటుంది? జనసేనకు ఎన్ని? బిజెపికి ఎన్ని? అనేది చర్చ నడుస్తోంది. అయితే మొత్తం నాలుగు ఎంపీ స్థానాల్లో టిడిపికి మూడు, జనసేనకు ఒకటి దక్కే అవకాశం ఉంది. ఎందుకంటే గతంలో జనసేనకు అవకాశం కల్పించలేదు. బిజెపి ఎక్కువ ఎంపీ పదవులను దక్కించుకుంది. అందుకే ఈసారి బిజెపికి ఛాన్స్ లేదని.. జనసేనకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.తెలుగుదేశం పార్టీకి మూడు పార్లమెంట్ స్థానాలకు గాను.. ఒకటి సానా సతీష్ కు కొనసాగింపు ఉంటుంది. మిగతా రెండు ఎంపీ పదవుల కోసం పార్టీలో విపరీతమైన పోటీ ఉ ంది. ముఖ్యంగా వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, భాష్యం రామకృష్ణ, గల్లా జయదేవ్, దేవినేని ఉమామహేశ్వరరావు.. ఇలా చాలామంది పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వర్ల రామయ్య గతంలో పార్టీ అధికారంలో లేనప్పుడే ఓడిపోతానని తెలిసి రాజ్యసభకు పోటీ చేశారు. అందుకే తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. మరోవైపు యనమల రామకృష్ణుడు సైతం రాజ్యసభ పదవి పై ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రస్థాయిలో అన్ని రకాల పదవులు అనుభవించారు. అందుకే ఇప్పుడు పెద్దల సభకు వెళ్లాలని ఆయన భావిస్తున్నారు.

అక్షర యజ్ఞం..పంప భారత అనువాదం



పంప మహాకవి కన్నడ భాషలో రాసిన భారతం 500-600 పేజీలు కాగా, తెలుగు భాషలో 1,800 పేజీలతో వెలువడింది. దీనిని ఒక అక్షర యజ్ఞంగానే భావించక తప్పదు. ఎందుకంటే.. అనంతపూర్‌కు చెందిన డాక్టర్ జోస్యుల సదానంద శాస్త్ర పంప భారతాన్ని కన్నడ భాష నుండి తెలుగు భాషలోకి (విక్రమార్జున విజయం) పేరిట అనువాదం చేయడంలో ఎంత సాహసించారో మాటల్లో చెప్పనలవి కాదు. 1,100 ఏండ్ల క్రితం కన్నడంలో రాసిన ఈ పుస్తకాన్ని ఎవరూ తెలుగు భాషలోకి తీసుకురాలేకపో యారు. ఈ పుస్తకంలో ప్రతి పదానికి అర్థం సవివరంగా పేర్కొన్నారు. పంపన కవి రాసిన భారతం అనువాదం బృహత్ ప్రయత్నమనే చెప్పకతప్పదు. ఈ బృహత్ యజ్ఞంలో జోస్యుల సదానంద శాస్త్రతో పాటు ఉభయభాషా విశారదులైన అనంతపూర్ శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం విశ్రాంత కన్నడ ఆచార్యులు డా కే .శేష శాస్త్ర, బెంగళూర్‌లోని ఆచార్య పాఠశాలకు చెందిన పండితులు డా కే ఆర్ గణేష్, శతావధాని డా ఆర్ గణేష్ తమ వంతు పాత్ర పోషించారు. తొంభై ఏండ్ల వయసులో ఉన్న అంతర్జాతీయ సాహిత్యమూర్తి హంపన కూడా తాను వేయించిన పంపన చిత్రాలు అందించి సాయం చేశారు. తెలుగు భాష పట్ల ఆయనకు ఉన్న గౌరవం .. తెలుగు ప్రజావళి పట్ల ఆయనకు ఉ న్న అభిమానం వేనోళ్ల కొనియాడదగినది. తెలుగు సాహిత్య వికాసానికి తొలినాటి పునాదులు వేసిన పంపన కృషి మరొకసారి వెలుగులోకి వచ్చి, ఆయనకు తగిన గుర్తింపు, గౌరవం ఇప్పుడైనా తెలుగు సాహితీ లోకంలో దక్కాల్సి ఉంది.

బోధన్ ప్రాంతం మీద 30-50 పేజీలు: ఎప్పుడూ మూలాల్లోకి చూడాలి అని డా నాళేశ్వరం శంకరం అంటూ ఉండేవారు. బోధన్ చరిత్ర ఎంతో గొప్పది. అందుకే ఎప్పుడో 1,100 ఏండ్ల క్రితం రాసిన విక్రమార్జున విజయంలో బోధన్ ప్రాంతం మీద 30-50 పేజీలు ఉన్నాయంటే కుతూహలం కలిగింది. ఎన్నో ఏండ్లు ఆ పుస్తకాన్ని అనువాదం చేయించాలని తపన పడ్డాను. చివరికి అనంతపూర్‌లో జోస్యుల సదానంద శాస్త్రని సంప్రదించాను. అసలు పంపనే పూని జోస్యుల సదానంద శాస్త్రతో రాయించుకున్నాడా అనిపించేంత గొప్పగా శాస్త్ర ఈ పంప భారతం కన్నడ నుండి తెలుగు భాషలోకి అనువాదం చేశారు.

కథా సారాంశం: 14 అశ్వాసాలు ఉన్న ఈ 1,800 పేజీల పుస్తకం కన్నడ నుండి తెలుగులోకి అనువాదమైంది.

పంపన 9 శతాబ్దంలో రాసిన విక్రమార్జున విజయాన్ని తెలుగులోకి తీసుకురావటానికి ప్రథమ అడ్డంకి భాష, వర్ణనలు, పాత్ర చిత్రణ, రసపోషణ, ఛందస్సులు. ఎన్నో తరాల కిందటి పుస్తకం ఇది. భరతవంశ పుట్టుక నుండి మొదలైన ఈ కథ ఒకే వంశానికి చెందిన కొన్ని తరాల కథ. ముఖ్య ప్రాధాన్యం కురుపాండవ జననం ..రాజ్యాధి కారం కోసం జరిగిన ఘర్షణలు, చివరికి కురుక్షేత్ర సంగ్రామం.. శూరుల శౌర్యాలు.. యోధుల మరణాలు.. మరణించినవారి ఉత్తరక్రియలు.. వ్యూహాలు.. ప్రతివ్యూహాలు చివరికి కడుపు కోతలు.. అంతిమంగా కౌరవుల పతనం..

పాండవుల విజయం.. సుభద్ర అర్జునుల పట్టాభిషేకం.. కుంతి, గాంధారి, ధృతరా(ష్టులు తపోవనానికి తరలిపోవటంతో కథ ముగుస్తుంది. స్వర్గారోహణ పర్వం మాత్రం ఉండదు. అర్జునుని నామకరణంలో అరికేసరి బిరుదులన్నీ అర్జునుని పేర్లుగా రాయటం, భారతంలో ఎవరినీ తలవకు.. కర్ణుని తలుచుకో.. భారతం కర్ణ రసాయనం అంటాడు పంపన.

శాంతా వసంత ట్రస్ట్ సాయంతో పుస్తకరూపం: అనువాదానికి నాలుగేండ్లు కష్టపడ్డా ..1,100 ఏళ్లుగా ఈ పుస్తకాన్ని ఎవ్వరూ తెలుగులోకి తీసుకు రాలేకపోయినా ..ఈ చరిత్రను ప్రజలకు అందించాలంటే ప్రచురణ కావాలి కదా..ఇది మళ్లీ ఒక పెద్ద య జ్ఞం అయ్యింది. మొండిధైర్యంతో అనువాదం పూర్తి చేయగలిగినా లక్షల్లో ప్రచురణ కావాలి. ఎన్నో అవాంతరాలు వచ్చినా ఏడాదిగా రైన్ బో ప్రింటర్స్ నరేంద్ర ఎంతో శ్రమకోర్చి పుస్తకాన్ని తయారుచే శారు. ఈ అనువాదంలో ఏ సమస్యకైనా సులువుగా పరిష్కారం సూచించే ఆచార్య తంగెడ కిషన్‌రావు సలహాతో.. డా.హరికృష్ణ మాట సాయంతో శాంతా బయోటెక్ సంస్థ అధినేత వరప్రసాదరెడ్డి సమ్మతించటంతో గొప్ప పుస్తకం అందరికీ దక్కాలనే సదుద్దేశంతో ఆకర్షణీయంగా ముద్రించి ఇచ్చారు రెయిన్ బో ప్రింట్ నరేంద్ర.

ఈ గ్రంథం ఒక ఆణిముత్యం..: ఈ బృహత్ ప్రయత్నం ఇంతటితోనే ఆగిపోకూడదు. తెలుగు సాహిత్య చరిత్రను మరొక రెండు వందల సంవత్సరాల పాటు పొడిగించగలిగే నేపథ్యాన్ని, బలమైన సాక్ష్యాల ను అందిస్తున్న ఈ గ్రంథం ఒక ఆణిముత్యం. తెలుగులో విశ్వవిద్యా లయాలు, పరిశోధనా సంస్థలు, తెలుగు భాషాభిమానులు ఈ దిశగా మరింత విస్తృత పరిశీలన, పరిశోధన చేయాల్సిన అవసరం ఉందని ఈ పుస్తకం చెబుతుంది. అంతేకాకుండా తెలం గాణ సాహిత్య చరిత్రను ఈ గ్రంథం ప్రాతిపదికగా పునరుద్ధరిం చాల్సిన అవసరం ఏర్పడుతున్నది. తెలంగాణ చరిత్రకు దర్పణం ఇది. 1,100 ఏండ్ల క్రితమే పంప విక్రమార్జున విజయంలో బోధన్ ప్రాంతం గురించి విపులంగా రాశారు. పంపన రచనల పరిశోధన కోసం ఒక ప్రత్యేక అధ్యయన కేంద్రాన్ని బోధన్ ప్రాంతంలో కానీ నిజామాబాద్ తెలంగాణ విశ్వవిద్యాలయంలో కానీ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగు అకాడమీ, భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు శాఖలు, విశ్వవిద్యాల యాలు ఈ దిశగా మరిన్ని పరిశోధనలతో, విశ్లేషణల తో, గ్రంథా లను పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. పంపనను కన్నడ ప్రజలు ఆదికవిగా సొంతం చేసుకున్నప్పటికీ ఈ నేల బిడ్డగా కూడా మనం ఆయనను గౌరవించుకోవాల్సిన సమయం వచ్చింది. ఈ విధమైన బహుళ కోణాల్లో కృషి జరిగినప్పుడే తెలంగాణ విస్మృత సాహిత్య చరిత్ర వెలుగులోకి వచ్చి సంపూర్ణ సాహిత్య రూపం ఆవిష్కృతమవుతుంది. కన్నడ భాషకే కాదు.. తెలుగు భాషకు కూడా ఆదికవే..: కన్నడ భాషకి ఆదికవే కాదు.. తెలుగు భాషకు కూడా ఆదికవిగా పరిశోధకులు ఇప్పుడు తేలుస్తున్న పంప మహాకవి పంపభారతంతో పాటుగా చాలా గ్రంథాలు రాశాడు. ఎంతోమంది చరిత్రకారులు నిజామాబాద్ జిల్లా, బోధన్ చరిత్రను పరిశీలించి, పరిశోధించి ఎన్నో విషయాలు ఎరుకపరిచారు.

పంపకవి తెలంగాణ వాడేనని సాధికారికంగా చెప్పారు. నేలటూరి వేంకటరమణయ్య చెప్పినట్టు విక్రమార్జున విజయం కొత్త ఒరవ డితో సాగే లౌకిక కావ్యంగా అర్జున పాత్రగా అనిపించినా అరికేసరి మాత్రమే మనకు కనిపిస్తాడు. విక్రమార్జున విజయాన్ని అంకితం చేసినందుకు తన ఆస్థానకవి అయిప పంపనను కవితా గుణార్ణవుడు అనే బిరుదుతో ఘనంగా సత్కరించాడు. కన్నడ, తెలుగు, సంస్కృత భాషల్లో అఖండ పాండిత్యం పంపనకే కాక అతని తమ్ముడు జిన వల్లభుడికి కూడా ఉందని.. కురిక్యాల శాసనాన్ని గుర్తు చేస్తు న్నారు చరిత్రకారులు. తొలి తెలుగు కంద పద్యం అక్కడే కనిపించి ంది. జగిత్యాల దగ్గరి ధర్మపురి అగ్రహారాన్ని పంపనకి అనుగ్రహ ంతో దానం చేశారని చెబుతారు.

సదానంద శాస్త్ర వైదుష్యం:

జోస్యులసదానంద శాస్త్ర కర్నూలు జిల్లా ఆలూరు తాలూకా కమ్మరచే డులోజన్మించారు. తిరుపతి శ్రీ వేంకటే శ్వర ప్రాచ్య కళాశాల నుంచి పట్టభద్రులై శ్రీ వేంకటేశ్వర వర్సిటీ నుంచి ఎంఏ చేశారు. బెంగళూరు విశ్వవిద్యాలయం నుంచి 'పంప- నన్నయ తులనాత్మక అధ్యయనం'పై డాక్టరేట్ చేశారు. అనంతపురం సాయిబాబా నేషనల్ జూనియర్ కళాశాలలో 33 ఏండ్లపాటు అధ్యాపక వృత్తి నిర్వహించి 2010లోరిటైరయ్యారు. కన్నడం నుంచి తెలుగులో 20కి పైగా, తె లుగునుంచి కన్నడకు ఏడు గ్రంథాలు అనువదించారు. హరికథకు డుగాఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల్లో పేరు తెచ్చుకున్నారు. అష్టావధానాలు, ఆధ్యాత్మికోపన్యాసాలు,పురా ణ ప్రవచనాలు ఆయనకు ఖ్యాతి తెచ్చాయి.

నాలుగు పదులు దాటితే..



చికిత్స కంటే నివారణే ఉత్తమమైనది అని తరచుగా వింటుంటాం. ఖరీదైన చికిత్స, ప్రాణహానికలిగించే రోగాలపట్లేకాదు వస్తేపోని పలురకాల జబ్బులకు కూడా ముందు జాగ్రత్తే ఉత్తమం. ముఖ్యంగా నలభై దాటాక ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న వాళ్లు ఆరోగ్యంగానే కాదు, ఆర్థికంగానూబాగుంటారు. అయితేఆరో గ్యంపై అవగాహన లేక చాలా మంది వైద్య పరీక్షల విషయంలో దాటవేత ధోరణి ప్రదర్శిస్తుంటారు. పరీక్షలు చేయించుకుంటే ఏదైనా రోగం బయటప డుతుందనే భయంతోనూ కొందరు టెస్ట్‌లకు వెనకడుగు వేస్తుంటారు. కానీ,ముదిరిన తర్వాత రోగం బయటపడితే, చేతులు కాలాక ఆ కులు పట్టుకున్న చందంగా బతుకు తయారవుతుంది. అందుకే ఒక వయసు వచ్చిన తర్వాత ఏడాది, రెండేండ్లకు ఒకసారైనావైద్య పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం. ఆరోగ్యంగా ఉ ండేందుకు, రాబోయే రోగాలను అంచనా వేసేందుకు ఏ వయసులో ఏ పరీక్షలు చేయించుకోవాలో నిపుణులు సూచిస్తున్నారు. ఎన్నాళ్లకు ఒకసారి పరీక్షలు అవసరమో చెబుతున్నారు. ఫుల్‌బాడీ చెకప్‌లకు డబ్బులు వృథా చేయకుండా, వయసుకు తగ్గ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సలహా ఇస్తున్నారు. లక్షణాలేవీ బయటపడకుం డాశరీరంపై దాడి చేసే రోగాల విషయంలో నలభై దాటాక అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు. కొన్ని పరీక్షలు అనివార్యంగా చేయించుకోవాలి.

బీపీ: కనీసం ఏడాదికి ఒక్కసారైనా బీపీ చెకప్ చేయించుకోవాలి. హైపర్ టెన్షన్ అనేది గుండెపోటు, గుండె జబ్బులకు దారితీస్తుంది. కాబట్టి రెగ్యులర్‌గా బీపీ చెకప్ చేసుకుంటూ ఉండాలి.ఫాస్టింగ్ గ్లూకోజ్/గ్లయికాసిలేటెడ్ హిమోగ్లోబిన్ (హెచ్‌బీఏవన్‌సీ): కనీసం మూడేళ్లకు ఒకసారి చేయించుకోవాలి. ఇది చిన్న వయసులోనే వ చ్చేడయాబెటిస్, బరువు కోల్పోవడాన్ని ముందే చెబుతుంది. లిపిడ్ ప్రొఫైల్: ప్రతి మూడు నుంచి అయిదేండ్లకు ఒకసారి చేయించాలి. సాధారణ కొలె(స్టాల్ లెక్క తప్పుదారి పట్టిస్తుంది. కాబట్టి ఎల్‌డీఎల్ కొలె(స్టాల్ పరిమాణంపై దృష్టిపెట్టాలి. శరీర బరువు, నడుము చుట్టుకొలత:పొట్టపెరగడం రక్తప్రసరణవ్యవస్థపై ప్రతికూలత చూపు తుంది. అందుకే శరీరంలో వచ్చే మార్పులు గమనిస్తూ ఉండాలి. కంటి పరీక్ష:ఏడాదికోసారి కంటి పరీక్షలు చేయించాలి. దృష్టిలోపా లు,గ్లకోమా సమస్య ఉన్నట్లయితే చికిత్స తీసుకోవాలి.డెంటల్ చెక ప్: దంత సమస్యలు. గుండె జబ్బులు, షుగర్ వ్యాధికి కారణమవు తాయి. కాబట్టి ఏడాదికి ఒకసారైనా దంత పరీక్షలు చేయించుకోవా లి.పొగాకు,మద్యం,పదార్థాలవినియోగంఉంటే వాటి వల్లవచ్చే సమ స్యలకు కూడా అదనంగా పరీక్షలు చేయించుకోవాలి.

ఆత్మరక్షణలోకి బీఆర్ఎస్!



హైదరాబాద్: తెలంగాణ రాజకీయంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా తీవ్రమైన సామాజిక సమీకరణాల పోరుగా రూపాంతరం చెందుతోంది. కేసీఆర్ కుటుంబంపై కేవలం అవినీతి, భూదోపిడి అనే కోణంలోనే కాకుండా.. తెలంగాణలో దశాబ్దాల పాటు సాగిన గడీల పాలన , దొరల అరాచకాలు అనే సామాజిక భయాన్ని ప్రజల మనసుల్లో బలంగా నాటడానికి కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇటీవల కేసీఆర్ ను ఉద్దేశించి చేసిన తీవ్ర వ్యాఖ్యలు, ఆపై వచ్చిన విమర్శలు.. దానికి కౌంటర్ గా వెలమ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటూ ఆయన చేసిన హెచ్చరికలు కొత్త రాజకీయానికి కారణంగా కనిపిస్తున్నాయి.తెలంగాణ చరిత్రను పరిశీలిస్తే బడుగు, బలహీన వర్గాలు గడీల ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాగించిన పోరాటాలకు సుదీర్ఘమైన నేపథ్యం ఉంది. తెలంగాణ ఉద్యమం ద్వారా ఆ సామాజిక అసంతృప్తి తాత్కాలికంగా పక్కకు వెళ్లినప్పటికీ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్ణయాధికారాలన్నీ ఒకే కుటుంబం, నిర్దిష్ట సామాజిక వర్గం చేతుల్లోనే కేంద్రీకృత మయ్యాయనే భావన బీసీ, దళిత వర్గాల్లో బలంగా నాటుకుపోయింది. ఇప్పుడు ఇదే చారిత్రక అసంతృప్తిని ఆసరాగా చేసుకుని, కేసీఆర్ కుటుంబాన్ని కేవలం ఒక రాజకీయ శత్రువుగానే కాక, బహుజన వర్గాల అవకాశాలను ఆక్రమించిన సామాజిక ప్రతినిధిగా చిత్రీకరించేందుకు రేవంత్ పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తున్నారు.ఈ రాజకీయ క్రీడలో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మక సంకేతాలను పంపుతున్నారు. కేసీఆర్ కుటుంబం వద్ద ఉన్న ఆస్తులు, వారి సామాజిక వర్గం ఎంత ఉందో, వారు అనుభవిస్తున్న పదవులు ఎన్ని అనే అంశాలపై పరోక్షంగా, ప్రత్యక్షంగా సభల్లోను, సభల వెలుపల ప్రస్తావించడం ద్వారా ప్రజల్లో ఆలోచన రేకెత్తించే ప్రయత్నం చేస్తున్నారు. వెలమ దొరల పాలనలో నష్టపోయిన బహుజన బిడ్డలకు అధికారాన్ని అందించామనే నరేటివ్‌ను బలోపేతం చేయడం ద్వారా ప్రతిపక్ష బీఆర్ఎస్‌ను ఆత్మరక్షణలోకి నెట్టడమే రేవంత్ రెడ్డి మార్క్ రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది.శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్ లాంటి నేతలు మరింత దూకుడు ప్రదర్శిస్తున్నారు.కేసీఆర్‌ను ఉద్దేశించి చావు డప్పు కొడతాం అనడం, వెలమ సామాజిక వర్గాన్ని నేరుగా హెచ్చరిస్తూ పరుష పదజాలంతో విరుచుకుపడటం వెనుక.. బీఆర్ఎస్ కౌంటర్ దాడి చేస్తే దానిని దొరలు-బహుజనుల మధ్య ఘర్షణగా మలిచే ఆంతర్యం దాగి ఉందనేది కొట్టిపారేయలేము. తాండ్ర పాపారాయుడి పౌరుషం ప్రస్తావిస్తూ, సీఎం రేవంత్‌కి తెల్వకుండానే అంతు చూస్తాం అంటూ తొడగొట్టడం వెనుక కేవలం ఆవేశం మాత్రమే కాకుండా, వెలమ ఆధిపత్యాన్ని సవాల్ చేస్తున్నారనే భావనను దిగువ వర్గాల్లోకి బలంగా పంపాలనే ఆలోచన స్పష్టమవుతోంది.బిఆర్ఎస్ తన పది సంవత్సరాల పాలనలోని అభివృద్ధిని చూపి పుంజుకోవాలని చూస్తుంటే, కాంగ్రెస్ సర్కార్ మాత్రం కేసీఆర్ కుటుంబాన్ని పొలిటికల్‌గా మాత్రమే కాకుండా సోషియో-పొలిటికల్‌గా కార్నర్ చేయడానికి సిద్ధమైంది. సెంటిమెంట్లు, కుల సమీకరణాలు అత్యంత సున్నితంగా ఉండే తెలంగాణ రాజకీయాల్లో ఈ సామాజిక వర్గాల ' వ్యతిరేక ప్రచారం రాబోయే రోజుల్లో ఎంతటి విధ్వంసకర రాజకీయ పరిణామాలకు దారితీస్తుందో, ఎవరికి రాజకీయ లబ్ధి చేకూరుస్తుందో వేచి చూడాలి.

ఎయిర్ పోర్టు క్రెడిట్ కోసం రేవంత్



వరంగల్: తెలంగాణ సంస్కృతికి, పోరాటాల చరిత్రకు వరంగల్ జిల్లా గుండెకాయ లాంటిది. ఓరుగల్లు మట్టికి ఉన్న రాజకీయ, భావోద్వేగ ప్రాముఖ్యత హైదరాబాద్‌ను మించి ఉంటుంది. అలాంటి చారిత్రాత్మక వరంగల్‌లోని దశాబ్దాల కల అయిన మామునూరు ఎయిర్‌పోర్ట్ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వ్యూహం ప్రత్యేకమైనది. ఎయిర్‌పోర్ట్ రన్ వేలు, టెర్మినల్ భవనాల నిర్మాణం ఇంకా తొలి దశలోనే ఉన్నప్పటికీ.. ఈ కొత్త ఎయిర్‌పోర్ట్‌కు ఏ పేరు పెడితే బాగుంటుంది? మీ సూచనలు తెలపండి అంటూ సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా వేసిన ఒకే ఒక్క ప్రశ్న ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎమోషనల్ అండ్ పొలిటికల్ డిబేట్‌గా మారింది.కార్యరూపంలో ఒక పనిని పూర్తి చేయడం ఒకెత్తయితే, దాని నుంచి గరిష్ట రాజకీయ ప్రయోజనాన్ని, క్రెడిట్ ను తమ ఖాతాలో వేసుకోవడం మరొక ఎత్తు. ఈ విషయంలో రేవంత్ రెడ్డి అందరికంటే రెండు అడుగులు ముందే ఉన్నారని చెప్పవచ్చు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మామునూరు ఎయిర్‌పోర్టుకు భూసేకరణ జరగలేదని, బీఆర్ఎస్ నేతలు కేవలం ఫామ్‌హౌస్‌లకే ప్రాధాన్యమిచ్చారని విమర్శిస్తూనే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ. 295 కోట్ల నిధులు కేటాయించి, 280 ఎకరాల భూసేకరణ పూర్తి చేసి ఏఏఐ కి అప్పగించిన విషయాన్ని రేవంత్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. టెండర్ల ప్రక్రియ రూ. 213 కోట్లతో ప్రారంభమైన వెంటనే 'పేరు సూచించండి' అని పిలుపునివ్వడం ద్వారా ప్రాజెక్ట్ సాధన క్రెడిట్ మొత్తాన్ని తన ఖాతాలోకి లాక్కోగలిగారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం తర్వాత తెలంగాణలో ప్రస్తుతం మరే ఇతర రవాణా ఎయిర్‌పోర్ట్ లేకపోవడం వల్ల.. ఉత్తర తెలంగాణకు వరంగల్ ఎయిర్‌పోర్టే ఏకైక లైఫ్‌లైన్‌గా మారబోతోంది. ఇది కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాదు; కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఐటీ రంగాలు, రామప్ప దేవాలయం, వెయ్యి స్తంభాల గుడి వంటి పర్యాటక ప్రాంతాలకు ఒక న్యూ గ్లోబల్ గేట్‌వే అని చాటిచెప్పడం ద్వారా రేవంత్ ఓరుగల్లు ప్రజల ఆకాంక్షను తట్టారు. ఈ 'నేమ్ గేమ్' పిలుపునకు సోషల్ మీడియా నుంచి, సినీ రంగానికి చెందిన ప్రముఖుల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. వరంగల్‌కు చెందిన ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా స్పందిస్తూ రుద్రమ అంతర్జాతీయ విమానాశ్రయం లేదా కాకతీయ అంతర్జాతీయ విమానాశ్రయం అనే పేర్లను సూచించగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సమ్మక్క-సారలమ్మ,నటుడు విజయ్ దేవరకొండ, బండ్ల గణేష్, ఇతర నేతలు కాకతీయ , పి.వి. నరసింహారావు , 'చాకలి ఐలమ్మ వంటి చారిత్రాత్మక పేర్లను లేవనెత్తారు. సందీప్ వంగాకు రేవంత్ ఇచ్చిన దట్స్ ది స్పిరిట్‌రిపై కూడా సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యింది.దీని ద్వారా రేవంత్ సాధించిన రాజకీయ ప్రయోజనం ఏంటంటే.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తయి అందుబాటులోకి రావడానికి కనీసం మరో రెండేళ్లు సమయం పడుతుంది. కానీ, ఈ పేరు చుట్టూ నడిచే చర్చ వల్ల వరంగల్, కరీంనగర్, ఖమ్మం వంటి కీలక జిల్లాల ప్రజల మనస్సులో మామునూరు ఎయిర్‌పోర్టును మళ్లీ ట్రాక్‌పైకి తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే.. రేవంత్ రెడ్డి చొరవతోనే ఇది సాధ్యమైంది అనే బలమైన ముద్ర పడింది. నిర్మాణం పూర్తికాకముందే ఎమోషనల్ కనెక్ట్‌ను క్రియేట్ చేయడంలో సీఎం సక్సెస్ అయ్యారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ దీనిపై ఎంతగా ఎదురుదాడి చేయాలని చూసినా, భూసేకరణ పూర్తికావడం, ఆంక్షల క్లియరెన్స్ సాధించడం, టెండర్లు పడటం వంటి సాంకేతిక ఆధారాలు కాంగ్రెస్ వైపే ఉన్నాయి. ఎయిర్‌పోర్ట్ పేరుపై చర్చ పెట్టడం ద్వారా తెలంగాణ మూలాలను, ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తున్నారనే భావన కల్పిస్తూనే.. రాబోయే రోజుల్లో వరంగల్‌లో కాంగ్రెస్ తన రాజకీయ పట్టును మరింత పటిష్టం చేసుకునే దిశగా సీఎం రేవంత్ రెడ్డి తెలివైన పావును కదిపారని భావిస్తున్నారు.

అల్వాల్లో తొలిసారిగా ఆయిల్పామ్ అవగాహన సదస్సు



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కేశంపేట మండలం అల్వాల్ గ్రామంలో తొలిసారిగా ఆయిల్పామ్ సాగుపై అవగాహన సదస్సుతో పాటు పంట కోత మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు భుజంగారెడ్డి సాగు చేసిన ఆయిల్పామ్ తోటలో తొలి పంట కోతను షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు,ఉద్యానవన అధికారులు, ఉద్యానవన విస్తరణ అధికారులు, వాల్యూ ఆయిల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.జిల్లాలో 4,370 ఎకరాల్లో ఆయిల్పామ్ సాగు రంగారెడ్డి జిల్లా ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ కే.సురేష్ మాట్లాడుతూ... మూడు సంవత్సరాల క్రితం నాటిన ఆయిల్పామ్ తోటలో తొలి పంట కోత ప్రారంభించేందుకు వచ్చామని తెలిపారు.రంగారెడ్డి జిల్లాలో తొలిసారిగా కోతకు వచ్చిన ఆయిల్పామ్ తోట భుజంగారెడ్డిదేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఆయిల్పామ్ సాగుపై అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించినట్లు తెలిపారు.జిల్లాలో మొత్తం 3.57 లక్షల ఎకరాల సాగుయోగ్యమైన భూమి ఉందని,కాల్వలు, రిజర్వాయర్లు అందుబాటులో లేకపోవడంతో 57,637 బోర్లు, 5,600 బావుల ఆధారంగా సాగు జరుగుతోందని వివరించారు.జిల్లాలో మొదటి ఏడాది 510 ఎకరాలు, రెండో ఏడాది 1,637 ఎకరాలు, మూడో ఏడాది 1,601 ఎకరాల్లో ఆయిల్పామ్ సాగు ప్రారంభమైందని, ప్రస్తుతం మొత్తం 4,370 ఎకరాల్లో ఈ పంట సాగులో ఉందన్నారు.ఈ ఏడాది 2,300 ఎకరాల్లో ఆయిల్పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 829 మంది రైతులు 2,672 ఎకరాలకు నాన్-సబ్సిడీ చెల్లించి దరఖాస్తు చేసుకున్నారని సురేష్ తెలిపారు.ఆయిల్పామ్ 30 నుంచి 40 సంవత్సరాల పాటు సాగు చేయగల సుదీర్ఘకాలిక పంట అని, నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుందని చెప్పారు. ఎకరానికి నాలుగో సంవత్సరంలో సుమారు 4 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉండగా, పదో సంవత్సరం నాటికి 10 టన్నుల వరకు దిగుబడి సాధించే అవకాశం ఉందన్నారు.ప్రపంచంలో అత్యధికంగా నూనె దిగుబడిని ఇచ్చే పంటల్లో ఆయిల్పామ్ ముఖ్యమైనదని, వరి సాగుతో పోలిస్తే నీటి ఎద్దడి, కూలీల కొరత వంటి సమస్యలు తక్కువగా ఉంటాయని వివరించారు.

దానం గెలిస్తే...అమాత్యా గ్యారంటీ



హైదరాబాద్, : ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ ఇచ్చిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో నూతన సమీకరణాలకు తెరలేపింది. బి-ఫామ్‌పై ప్రత్యక్షంగా మరో పార్టీ తరపున పోటీ చేయడమే ఆధారంగా హైకోర్టు డివిజన్ బెంచ్ చారిత్రాత్మక తీర్పు ఇవ్వడంతో, దానం పొలిటికల్ కెరీర్ ఒక కీలకమైన మలుపు వద్దకు వచ్చింది. తొలుత ఉపఎన్నికకు సిద్ధమని ప్రకటించినప్పటికీ, న్యాయ నిపుణుల సలహాతో దానం నాగేందర్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే, స్పష్టమైన దస్తావేజు ఆధారాలు ఉన్న ఈ కేసులో సుప్రీంకోర్టు నుండి తక్షణ స్టే దక్కడం సులువు కాదనేది చట్ట నిపుణుల అంచనా.న్యాయస్థానాల్లో సుదీర్ఘంగా సాగే ప్రక్రియ ద్వారా విచారణను ఆలస్యం చేయడం కంటే, దానం నాగేందర్ నేరుగా ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ఉపఎన్నికను ఎదుర్కొనడమే ఆయన రాజకీయ భవిష్యత్తుకు అత్యంత ప్రయోజనకరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ కేబినెట్‌లో గ్రేటర్ హైదరాబాద్ పరిధికి చెందిన బలమైన బిసి నాయకుడి ప్రాతినిధ్యం లేకపోవడం ఒక రాజకీయ లోటుగా ఉంది. దానం నాగేందర్ వంటి సీనియర్, బహుళ ప్రజాదరణ ఉన్న హైదరాబాద్ బిసి నేత మంత్రివర్గంలో ఉంటే గ్రేటర్ పరిధిలో పార్టీకి మరింత మైలేజ్ వస్తుందని కాంగ్రెస్ అధిష్టానం కూడా భావిస్తోంది.ఒకవేళ దానం నాగేందర్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధిస్తే, ఆయన రాజకీయ ఇమేజ్ ఒక్కసారిగా మారిపోతుంది. పార్టీ ఫిరాయింపుల ముద్రను, చట్టపరమైన అనర్హత వేటును నియోజకవర్గ ప్రజల తీర్పు ద్వారా చెరిపేసుకున్నట్లు అవుతుంది. అసెంబ్లీలోకి అడుగుపెడితే, ఆయన రాజకీయ నైతికతకు తిరుగులేని బలం చేకూరుతుంది. అప్పుడు ఆయనకు గ్రేటర్ హైదరాబాద్ కోటాలో కేబినెట్ బెర్త్ కేటాయించడం సీఎం రేవంత్ రెడ్డికి కూడా సులభం, అనివార్యం కానుంది. ఖైరతాబాద్ నియోజకవర్గ క్షేత్రస్థాయి సమీకరణాలు కూడా దానంకు పూర్తి అనుకూలంగా ఉన్నాయి. దశాబ్దాలుగా ప్రతి బస్తీలో ఆయనకు ఉన్న సొంత అనుచరగణం, వ్యక్తిగత పట్టు కాదనలేని సత్యం. ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీ వద్ద దానం స్థాయిని తట్టుకుని నిలబడే లోకల్ ఫేస్ గానీ, బలమైన సంస్థాగత కేడర్ గానీ అందుబాటులో లేదు.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ బలం, అభివృద్ధి సంక్షేమ పథకాలు తోడైతే ఉపఎన్నికలో గెలుపు నల్లేరుపై నడకేనని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. సుప్రీంకోర్టులో కేవలం విచారణల చుట్టూ కాలయాపన చేస్తూ ఉంటే.. నియోజకవర్గంలో అనుమానాలు, ప్రత్యర్థుల ప్రచారాలు ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. దానికంటే కోర్టుల కంటే ప్రజా కోర్టు పెద్ది అనే నినాదంతో ఉపఎన్నికల బరిలోకి దిగి, స్పష్టమైన మెజారిటీ సాధించడమే దానం నాగేందర్ స్థానాన్ని, రాజకీయ ఆధిపత్యాన్ని పునరుద్ధరిస్తుంది. కోర్టుల్లో స్టేల కోసం పోరాడటం కంటే ప్రజాక్షేత్రంలో తాడోపేడో తేల్చుకో?మే దానం నాగేందర్‌ను ఖైరతాబాద్‌కే కాదు, ఏకంగా సెక్రటేరియట్‌లోని మంత్రి పీఠం వైపు నడిపించే వ్యూహాత్మక మార్గమని ఎక్కువ మంది సలహాలిస్తున్నారు.

భాగ్యనగరంలో తగ్గిన రియల్ జోరు... నిలబెడుతున్న ఐటీ, జీసీసీలు



హైదరాబాద్, : కొన్నేళ్లుగా అనూహ్యమైన వృద్ధిని నమోదు చేసిన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు కాస్త నెమ్మదించింది. నివాస గృహాల విక్రయాలు మందగించినప్పటికీ, రికార్డు స్థాయిలో ఆఫీస్ స్పేస్ లీజింగ్, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) విస్తరణతో ఉద్యోగాల ఆధారిత డిమాండ్ బలంగా ఉంది. దీంతో రియల్టీ రంగం కుప్పకూలిపోయే ప్రమాదం ఏమీ లేదని, కాస్త జాగ్రత్తపడే దశలోకి ప్రవేశించిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక ప్రకారం, 2026 ప్రథమార్ధంలో హైదరాబాద్‌లో 19,249 నివాస గృహాల అమ్మకాలు జరిగాయి. ఇది గతేడాదితో పోలిస్తే కేవలం ఒకశాతం మాత్రమే అధికం. కొత్త ప్రాజెక్టుల ప్రారంభం 2 శాతం తగ్గి 20,466 యూనిట్లుగా నమోదైంది. అయితే, ఇళ్ల సగటు ధరలు మాత్రం 7 శాతం పెరిగి చదరపు అడుగుకు రూ. 8,258కి చేరాయి. అమ్ముడుకాని ఇళ్ల సంఖ్య 3 శాతం పెరిగి 56,095 యూనిట్లకు చేరింది. గచ్చిబౌలి, కొండాపూర్, కోకాపేట, నియోపోలిస్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాలు ఇప్పటికీ మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి.అయితే, క్రెడాయ్ హైదరాబాద్-క్రిమ్యాట్రిక్స్ నివేదికలో భిన్నమైన గణాంకాలు వెల్లడయ్యాయి. ఈ నివేదిక ప్రకారం, ఈ ఏడాది ప్రథమార్ధంలో అమ్మకాలు 13 శాతం తగ్గి 26,068 యూనిట్లుగా నమోదయ్యాయి.నివాస గృహాల మార్కెట్ మిశ్రమంగా ఉన్నప్పటికీ, వాణిజ్య నముదాయాల మార్కెట్ మాత్రం దూసుకుపోతోంది. 2026 ప్రథమార్ధంలో ఆఫీస్ స్పేస్ లావాదేవీలు 29 శాతం పెరిగి రికార్డు స్థాయిలో 7.5 మిలియన్ చదరపు అడుగులకు చేరాయి. ఇందులో జీసీసీల వాటానే 45 శాతం (3.4 మిలియన్ చదరపు అడుగులు) ఉండటం గమనార్హం. ప్రస్తుతం నగరంలో 515కు పైగా జీసీసీలు ఉండగా, వీటిలో 3 లక్షల మందికి పైగా నిపుణులు పనిచేస్తున్నారు. రాబోయే 3-5 ఏళ్లలో జీసీసీల ద్వారా మరో 8-12 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ ఏర్పడవచ్చని అనరాక్ రీసెర్చ్ అంచనా వేసింది. "జీసీసీల విస్తరణ నగరంలో రియల్ ఎస్టేట్ డిమాండ్‌ను గణనీయంగా పెంచుతోంది" అని అనరాక్ గ్రూప్ ఛైర్మన్ అనూజ్ పురి తెలిపారు.మరోవైపు, ప్రతిపాదిత మెట్రో ఫేజ్-2, రీజినల్ రింగ్ రోడ్ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు కూడా రియల్టీ అంచనాలను ప్రభావితం చేస్తున్నాయి. అయితే, పెరుగుతున్న ధరల వల్ల అందుబాటు ధరల్లో ఇళ్ల దొరకడం సవాలుగా మారుతోంది. దెవలపర్లు ఎక్కువగా ప్రీమియం ప్రాజెక్టులపదృష్టి పెడుతున్నారు.మొత్తం మీద హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఒక పరిణితి చెందిన దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. ఉద్యోగ కల్పన, మౌలిక సదుపాయాలు, అందుబాటు ధర వంటి అంశాలే భవిష్యత్తులో ఈ రంగం వృద్ధిని నిర్దేశించనున్నాయని స్పష్టమవుతోంది.

13 ప్రాంతాల్లో హైటెక్ బస్టాండ్లు...

నల్గొండ : తెలంగాణలో ప్రజారవాణా వ్యవస్థను ఆధునీకరించే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై బస్టాండ్ అంటే కేవలం బస్సు కోసం వేచి చూసే ఇరుకు ప్రదేశం మాత్రమే కాకుండా, షాపింగ్, వినోదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చబోతోంది. తెలంగాణ ప్రభుత్వం, టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి వినూత్న ఆలోచనతో రాష్ట్రవ్యాప్తంగా 13 ప్రాంతాల్లో ఎయిర్‌పోర్ట్, కార్పొరేట్ స్థాయి హంగులతో మోడల్ బస్టాండ్లను నిర్మించేందుకు రవాణా శాఖ నుంచి అధికారిక ఆమోదం లభించింది.నూతనంగా అందుబాటులోకి రానున్న ఈ హైటెక్ బస్ స్టేషన్లలో ప్రయాణికుల కోసం మల్టీ-మోడల్ కనెక్టివిటీని ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల బస్సు దిగిన వెంటనే రైల్వే స్టేషన్లు లేదా ఇతర రవాణా సాధనాలను సులభంగా చేరుకోవచ్చు. అంతేకాకుండా కమర్షియల్ బిజినెస్ కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్ రేంజ్ ఫుడ్ కోర్టులు, పిల్లల గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లను అందుబాటులోకి తేనున్నారు. బిజినెస్ విస్తరణ కోసం వ్యాపారులు ఈ కాంప్లెక్స్‌లలో షాపులను కేటాయించుకోవచ్చని ఆర్టీసీ ప్రకటించింది.ప్రపంచ పటాలు పరిశీలించండి తొలివిడతగా నాగర్‌కర్నూల్, రేగొండ, హుజూర్ నగర్, కోదాడ, కొడంగల్, కోస్గి, మద్దూరు, కేసముద్రం, హుస్నాబాద్, ములుగు, మధిర, నల్గొండ, కొత్తగూడెం ప్రాంతాల్లో ఈ మోడల్ బస్టాండ్లను నిర్మించనున్నారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్న ఈ ప్రాజెక్టుతో తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు మరింత నాణ్యమైన, ఆధునిక సేవలను అందించనుంది.

రూ. 2 కోట్లు దాటేసిన ఇళ్లు...

హైదరాబాద్ : హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో కొనుగోలుదారుల ప్రాధాన్యతలు వేగంగా మారుతున్నాయి. ఇటీవల క్రెడాయ్, క్రే మ్యాట్రిక్స్ విడుదల చేసిన నివేదికల ప్రకారం.. నగరంలో ఇళ్ల విక్రయ సంఖ్య కంటే విక్రయాల వ్యాపార విలువ గణనీయంగా పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే నగటు ఇంటి కొనుగోలు ధర ఏకంగా 10 శాతం మేర పెరిగి, రూ. 1.85 కోట్ల నుంచి రూ. 2.03 కోట్లకు చేరింది. ఏటా సుమారు 2,300 చదరపు అడుగుల సగటు విస్తీర్ణం కలిగిన పెద్ద ఇళ్లకు డిమాండ్ ఉండటమే ఈ సగటు ధర పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచిందిప్రస్తుత మార్కెట్ ట్రెండ్‌ను పరిశీలిస్తే.. చిన్న సైజు ఫ్లాట్లు లేదా 2ఊఊఐ అపార్ట్‌మెంట్ల కంటే పెద్ద విస్తీర్ణం కలిగిన 3ఊఐ, 4ఊఐ లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాల కొనుగోలుకే నివానదారులు మొగ్గు చూపుతున్నారు. కరోనా మహమ్మారి తదుపరి ఏర్పడిన వర్క్ ఫ్రమ్ హోమ్ సంస్కృతి, జీవనశైలి మార్పులు , ఐటీ, /కార్పొరేట్ ఉద్యోగుల ఆర్థిక స్థిరత్వం కారణంగా ప్రీమియం, గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులకు డిమాండ్ పెరిగింది. విశాలమైన హాల్స్, హోమ్ ఆఫీస్ స్పేస్, క్లబ్ హౌస్ వసతులు ఉన్న లగ్జరీ గృహాలనే కొనుగోలుదారులు ఎంచుకుంటున్నారు.ఈ ఏడాది మొదటి అర్ధభాగంలో నగరవ్యాప్తంగా సుమారు 26,000 పైచిలుకు ఇళ్లు అమ్ముడుపోగా, వాటి మొత్తం వ్యాపార విలువ రూ. 52,913 కోట్లు దాటాయి. విక్రయించిన మొత్తం ఇళ్ల విస్తీర్ణంలో సుమారు 60 మిలియన్ చదరపు అడుగులను నమోదు చేసి దేశంలోనే హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. గచ్చిబౌలి, కొండాపూర్, కోకాపేట్, తెల్లాపూర్ , నార్సింగి వంటి వెస్ట్ హైదరాబాద్‌లోని ప్రధాన ఐటీ కారిడార్లలోని లగ్జరీ ప్రాజెక్టుల విక్రయాలే ఈ రికార్డు స్థాయి విక్రయాల విలువను నడిపించాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.కొనుగోలుదారుల మైండ్‌సెట్‌లో వచ్చిన ఈ ఊహించని మార్పుకు అనుగుణంగా రియల్ ఎస్టేట్ బిల్డర్లు, డెవలపర్లు కూడా తమ సరికొత్త ప్రాజెక్టులను ప్లాన్ చేస్తున్నారు. చిన్న ఫ్లాట్ల నిర్మాణం తగ్గించి, ఆధునిక సదుపాయాలు మరియు ప్రాక్టికల్ డిజైన్‌తో కూడిన పెద్ద ఇళ్ల నిర్మాణానికే పెద్దపీట వేస్తున్నారు.

హైదరాబాద్‌లో నీటి వృథాపై జలమండలి కఠిన చర్యలు
జూబ్లీహిల్స్‌లో ఐదుగురు వినియోగదారులకు జరిమానా



హైదరాబాద్: నగరంలో తాగునీటి వృథాను అరికట్టేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. సోమవారం జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన అధికారులు, తాగునీటిని వాహనాలు కడగడానికి, ఫ్లోర్‌లు శుభ్రం చేయడానికి వాడుతున్న ఐదుగురు వినియోగదారులకు జరిమానాలు విధించారు. ట్యాంకులు నిండి పొంగిపోతున్నా, నల్లాలు వదిలేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రారంభంలో అవగాహన కార్యక్రమాలు, హెచ్చరికలతో సరిపెట్టిన జలమండలి, మార్పు రాకపోవడంతో జరిమానాలను భారీగా పెంచింది. నిబంధనల ఉల్లంఘన తీవ్రతను బట్టి రూ. 1,000 నుంచి రూ. 5,000, రూ. 10,000, గరిష్ఠంగా రూ. 20,000 వరకు జరిమానాలు విధిస్తున్నారు. పదేపదే నీటిని వృథా చేసేవారి నల్లా కనెక్షన్లను శాశ్వతంగా తొలగిస్తామని స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం జూబ్లీహిల్స్‌లోని రోడ్ నెం. 23లో ఫ్లోర్ క్లీనింగ్‌కు తాగునీరు వాడుతున్న పూర్ణిమ అనే వినియోగదారురాలికి రూ. 20,000 జరిమానా విధించడం గమనార్హం.ఈ తనిఖీలను నగరం అంతటా విస్తరిస్తున్నారు. సోమవారం సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఎస్కే నగర్‌లో అక్రమంగా మోటార్ వాడుతున్నందుకు ఒకరికి రూ. 5,000, అల్కాపురి యాదవ్ నగర్‌లో తాగునీటితో ఫ్లోర్ కడుగుతున్నందుకు మరొకరికి రూ. 1,000 ఫైన్ వేశారు.నగరంలో పెరుగుతున్న నీటి డిమాండ్, ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, మంజీరా–సింగూరు జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గడం వల్లే ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. “ఈరోజు మనం వృథా చేసే ప్రతీ నీటి చుక్క, రేపు మరొకరి దాహార్తిని తీర్చగలదు” అని బోర్డు పేర్కొంది.అదే సమయంలో తమ సిబ్బందికి కూడా జలమండలి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నగరంలోని 15,000 కిలోమీటర్ల పైప్‌లైన్లలో ఎక్కడైనా లీకేజీ ఫిర్యాదు వస్తే 24 గంటల్లోగా శాశ్వత పరిష్కారం చూపాలని, తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకునే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించింది. నీటి దుర్వినియోగంపై ప్రజలు 99499 30003 అనే వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని బోర్డు సూచించింది. నీటి సంరక్షణ అనేది వినియోగదారులు, జలమండలి ఉమ్మడి బాధ్యత అని పేర్కొంది.

కాంగ్రెస్ మైండ్ గేమ్ లో గులాబీ దళం



నల్గోండ: వంద కాదు, ఐదువందలు కాదు.. ఏకంగా వెయ్యి రోజుల కాంగ్రెస్ మార్క్ పాలనపై అసెంబ్లీ సాక్షిగా ‘ఛార్జ్‌షీట్’ దాఖలు చేసి, రేవంత్ ప్రభుత్వాన్ని కడిగిపారేద్దామని గులాబీ బాస్‌లు పక్కా స్కెచ్ వేశారు. నల్ల చొక్కాలు తొడిగి, చేతిలో ప్లకార్డులు పట్టుకుని అసెంబ్లీ గేటు ముందు కేటీఆర్, హరీశ్‌రావులు దిగిన సీన్ చూసి.. ఇక ఈ వర్షాకాల సమావేశాల్లో ‘హైవోల్టేజ్ డ్రామా’ ఖాయం, కాంగ్రెస్ వికెట్ పడిపోవడం తథ్యం అని ప్రతిపక్ష శ్రేణులు తెగ మురిసిపోయాయి. తీరా కట్ చేస్తే.. అసలు కథ వేరేలా మారింది!ప్రభుత్వ వైఫల్యాలు, ఆరు గ్యారెంటీల బాకీల గురించి గళమెత్తాల్సిన చోట.. ‘తాతా మధు’ నోటి దురద పుణ్యమా అని కథ మొత్తం రివర్స్ తిరిగింది. పోలీసులతో తోపులాటలో ఆవేశం ఆపుకోలేక ఎమ్మెల్సీ గారు విసిరిన ఒక్క మాటతో.. కాంగ్రెస్‌కి బిగ్ ఆఫర్ దొరికినట్లయింది. ‘‘దళిత స్పీకర్‌ను అవమానిస్తారా?’’ అంటూ హస్తం నేతలు సెంటిమెంట్ కార్డు తీసి జనం మీదికి వదిలారు. ఇక అంతే! సభలో స్పీకర్ గారు కన్నీళ్లు పెట్టుకోవడం, కాంగ్రెస్ నేతలు ‘దళిత ఆత్మగౌరవం’ అంటూ రచ్చ చేయడం.. దీంతో బీఆర్ఎస్ తెచ్చిన ‘వెయ్యి రోజుల వైఫల్యాల’ అజెండా గాల్లో కలిసిపోయింది. ప్రభుత్వాన్ని కార్నర్ చేయాల్సిన గులాబీ నేతలు, చివరికి తమ నేత నోటిజారుడుకు సఫాయిలు చెప్పుకోవాల్సిన దయనీయ స్థితికి పడిపోయారు.రెండో రోజు సీన్ ఇంకా రసవత్తరంగా మారింది. అర్ధరాత్రి అరెస్టులు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు, ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు డిమాండ్లు.. ఇలా సీన్ మొత్తం బీఆర్ఎస్ నేతలకు ఊపిరాడకుండా చేసింది. ఇక సీఎం రేవంత్‌పై కేటీఆర్ గారు పెంచిన “డోస్” ఏమైనా వర్కవుట్ అయిందా అంటే.. అదీ లేదు! ప్రత్యర్థిని దెబ్బకొట్టబోయి తామే మరింత ఆవేశపడి, కాంగ్రెస్ నేతల చేతికి మరో ఆయుధాన్ని అందించారు.మరోవైపు, షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యల వివాదం బీఆర్ఎస్‌కు పక్కా “గోల్డెన్ ఛాన్స్”. దాన్ని పట్టుకుని జనాల్లో సానుభూతి పిండుకోవాల్సిన చోట.. కేటీఆర్ కంపెనీ ఆవేశంలో ఊగిపోయి ఆ అవకాశాన్ని నీళ్లపాలు చేసుకుంది.మొత్తానికి ‘ఛార్జ్‌షీట్’ పట్టుకుని కాంగ్రెస్‌ను కడిగేద్దామని వచ్చిన బీఆర్ఎస్.. చివరకు స్టేషన్ల చుట్టూ, కేసుల చుట్టూ తిరిగే పరిస్థితి తెచ్చుకుంది. ప్రత్యర్థిని ఆవేశంలో ముంచి తప్పు చేయించడంలో కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్ వర్కవుట్ అయితే.. ఉన్న అవకాశాలను వదిలేసుకుని గులాబీ దళం భలే ‘సెల్ఫ్‌గోల్’ వేసుకుందంటూ రాజకీయ విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు!

నకిలీ విల్లా వెంచర్ బిల్డర్‌పై తెలంగాణ రెరా కొరడా

హైదరాబాద్, : తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ మోసపూరిత బిల్డర్లపై తన ప్రతాపాన్ని చూపుతూ మరో సంచలన తీర్పు వెలువరించింది. సరైన అనుమతులు లేని విల్లా ప్రాజెక్ట్ పేరుతో ఓ అమాయక మహిళ నుంచి రూ. 79 లక్షలు భారీగా వసూలు చేసి, ఆపై నిర్మాణం పూర్తి చేయకుండా చేతులెత్తేసిన ఓ కేటుగాడికి వ్యతిరేకంగా బాధితురాలికి అనుకూలంగా తీర్పునిచ్చింది. చట్ట నిబంధనలను ఉల్లంఘించి వినియోగదారులను మోసం చేసిన ఆ బిల్డర్‌కు భారీ జరిమానా విధిస్తూ రెరా కఠిన చర్యలు తీసుకుంది. ఎలాంటి చట్టపరమైన అనుమతులు, లేఅవుట్ అప్రూవల్స్ లేకపోయినా ఆకర్షణీయమైన ప్రకటనలతో సదరు బిల్డర్ విల్లా ప్రాజెక్ట్‌ను విక్రయిస్తున్నట్లు నమ్మించాడు. దీనిని నిజమని నమ్మిన బాధితురాలు విల్లా కొనుగోలు నిమిత్తం విడతలవారీగా మొత్తం రూ. 79 లక్షలను ఆ సంస్థకు చెల్లించింది. అయితే డబ్బులు తీసుకున్నప్పటికీ ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగకపోగా, కనీస నిర్మాణాలు కూడా పూర్తి చేయకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు తక్షణమే న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ రెరాను ఆశ్రయించింది.బాధితురాలి ఫిర్యాదును అత్యంత సీరియస్‌గా పరిగణించిన టీఎస్‌రెరా అధికారులు ఇరువర్గాల వాదనలను విచారించి సమగ్ర దర్యాప్తు జరిపారు.
ఎలాంటి అనుమతులు లేకుండా ప్రాజెక్ట్ చేపట్టడం, డబ్బులు వసూలు చేసి మోసం చేయడం నిరూపితం కావడంతో రెరా చట్టం ప్రకారం బిల్డర్‌ను దోషిగా తేల్చారు. బాధితురాలి నుంచి వసూలు చేసిన అసలు మొత్తం రూ. 79 లక్షలను, ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించాలని స్పష్టం చేసింది.అంతేకాకుండా, ఆ మొత్తంపై కాలయాపన చేసినందుకు గాను వార్షికంగా 10.7 శాతం వడ్డీని కలిపి బాధితురాలికి తిరిగి చెల్లించాలని రెరా తన తీర్పులో తేల్చిచెప్పింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి వినియోగదా రులను మోసగిస్తే చట్టపరంగా ఎంతటి కఠిన చర్యలు ఉంటాయో ఈ తీర్పు ద్వారా మరోసారి రుజువైంది. సోషల్ మీడియా ప్రకటనలు,
అనుమతులు లేని ప్రీలాంచ్ వెంచర్లను గుడ్డిగా నమ్మి మోసపోవద్దని, రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో కొనుగోలుదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఈ ఘటన హెచ్చరిస్తోంది

రైతుల పేరుతో బీఆర్ఎస్ రాజకీయం
ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్ : కేటీఆర్ వ్యాఖ్యలకు ఎంపీ చామల కిరణ్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ ఏదో జరుగుతున్నట్లు బిఆర్ఎస్ పార్టీ నేతలను ఆరు బృందాలుగా పవర్ స్టేషన్ల వద్దకు పంపుతున్నారు. కేసీఆర్ విద్యుత్ ఛార్జీల కోసం పోరాటం చేశారని కేటీఆర్ అబద్దాలు చెప్తున్నారు. 2,000 సంవత్సరంలో బషీర్ బాగ్ కాల్పులు జరిగినప్పుడు కేసీఆర్ టీడీపీలోనే ఉన్నారని అన్నారు.కేసీఆర్ 2001 లో టీడీపీ నుంచి బయటకు వచ్చారు. మంత్రి పదవి ఇవ్వలేదు,డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చారని కేసీఆర్ టీడీపీ నుంచి బయటకు వచ్చారు.కేటీఆర్ చరిత్ర తెలుసుకో. రైతులకు ఉచిత విద్యుత్ పేటెంట్ హక్కు కాంగ్రెస్ పార్టీది. బిఆర్ఎస్ హయాంలో డిస్కంలలో 81 వేల కోట్ల అప్పులు చేశారు. ఛత్తీస్ ఘడ్ నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్ ను బీఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేసింది.కేసీఆర్ పిట్ట కథలు చెప్పడం బంద్ చేయాలని అన్నారు.చత్తీస్ ఘడ్ విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయి. ఇతర రాష్ట్రాల్లో తక్కువకే విద్యుత్ లభించే అవకాశం ఉన్నా చత్తీస్ ఘడ్ తో ఒప్పందం చేసుకున్నారు. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో సూపర్ క్రిటికల్ టెక్నాలజీ బదులు సబ్ క్రిటికల్ టెక్నాలజీ వాడి వెయ్యి కోట్లు నష్టం కలిగించారు. యాదాద్రిని ఓపెన్ బిడ్డింగ్ పెట్టకుండా నామినేషన్ పద్ధతిలో బి.హెచ్.ఈ.ఎల్ కు ఇచ్చి కమిషన్లు తీసుకున్నారు. విద్యుత్ పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడింది. మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డికి ఫామ్ హౌస్ లు ఎక్కడివి. ఎల్ నినో పై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. రైతులకు మేలు జరగాలని బిఆర్ఎస్ కోరుకోవాలి. రైతుల పేరుతో రాజకీయం చేస్తున్నారు. విపత్తులో రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని బిఆర్ఎస్ ఆలోచన చేస్తోంది. రైతులు ఎక్కువగా వరి పంటపై కాకుండా ఇతర పంటలపై దృష్టి పెట్టాలని ప్రభుత్వం అవగాహన కల్పిస్తోందని అన్నారు.ప్రాజెక్టుల పేరుతో ఏ ప్రాజెక్టుల వద్ద ఎంత అవినీతికి పాల్పడ్డారో మా వద్ద లెక్క ఉంది. నామినేషన్ పద్ధతిలో పవర్ ప్రాజెక్టుల కాంట్రాక్టులు ఇచ్చి కమిషన్లు పొందారు. నిరంతరం రైతులకు,ప్రజలకు కరెంటు ఇవ్వాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఫామ్ హౌస్ బాగోతాలను డైవర్ట్ చేయాలని బిఆర్ఎస్ ప్రయత్నం చేస్తోంది. తమకు ఓట్లు వేయలేదని ప్రజలు,రైతులపై బిఆర్ఎస్ కక్ష పెట్టుకుంది. ఎల్ నినోతో వచ్చిన కరువును కాంగ్రెస్ పై నెపం నెట్టాలని బిఆర్ఎస్ చూస్తోంది. బిఆర్ఎస్ రైతులను రెచ్చగొట్టి పంటకు వేయించి రైతులు ఆగం కావాలని భావిస్తోంది. బిఆర్ఎస్ ను రైతులు,ప్రజలు క్షమించరు. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ నేతల ఫైల్స్ ను ఒక్కొక్కటి బయట పెడతాము. మిగులు రాష్ట్రాన్ని 10 ఏళ్ళల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల మయం చేసిందని ఆరోపించారు.

పదవులు పంపకం..!

నల్గోండ : రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న తరుణంలో, అధికార కాంగ్రెస్ పార్టీ అందుకు తగ్గట్టు ప్రణాళికలు రచిస్తోంది. పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులు, కార్యకర్తలకు త్వరలోనే పదవుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది.
పండుగను పురస్కరిం చుకుని రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవులను భర్తీ చేయడానికి పార్టీ అధిష్టానం, రాష్ట్ర నాయకత్వం ముమ్మర కస రత్తు చేస్తున్నాయి. రాబోయే ఎన్నికల వ్యూహంలో భాగంగా ఈ నియామకాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నా యి.వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే పావులు కదుపుతోంది.
క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ సాగుతోంది. ఇందులో భాగంగానే వివిధ ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, సహకార సంఘాలు, ఖంఆూ, మార్కెట్ కమిటీలకు చైర్మన్లు, వైస్ చైర్మన్ల నియామక ప్రక్రియను వేగవంతం చేశారుఇటీవల ఢిల్లీ పర్యటనలో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పార్టీ అధిష్టానంతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ భేటీలో ఆశావహుల జాబితాను హైకమాండ్‌కు సమర్పించినట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డితో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ నియామకాలపై తుది నిర్ణయం వెలువడనుంది. విజయదశమి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసి, కార్యకర్తలకు కానుకగా అందించాలని పార్టీ భావిస్తున్నట్లు సమాచారం.
గత ఎన్నికల నుంచి పార్టీకి అంకితభావంతో పనిచేసిన సీనియర్ నాయకులు, గ్రాస్‌రూట్ కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. అదే సమయంలో పార్టీలోకి కొత్తగా చేరిన నాయకులకు సుమారు 20 శాతం మేర ప్రాతినిధ్యం కల్పించే అవకాశం ఉంది.అలాగే సామాజిక సమతుల్యతను కాపాడడంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనారిటీలు, మహిళలకు సముచిత స్థానం కల్పించనున్నారు. పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా ఖాళీగా ఉన్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ వంటి ఇతర కీలక పదవులను కూడా భర్తీ చేసే ఆలోచనలో నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది.
మొత్తానికి..పండుగ వేళ కాంగ్రెస్ పార్టీ ప్రకటించబోయే ఈ నామినేటెడ్ పదవుల జాబితా పార్టీలో నెలకొన్న అసంతృప్తులను తొలగించి, శ్రేణుల్లోజోష్ నింపుతుందనే అంచనాలు వెలువడుతున్నాయి. రాబోయే రాజకీయ పోరుకు ఈ నియామకాలు ఒక బలమైన పునాదిగా మారుతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

మళ్లీ భగ్గుమంటున్న క్రూడాయిల్

న్యూఢిల్లీ,: పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ముడి చమురు ధరలు 100 డాలర్లను దాటింది. దీంతో స్టాక్ మార్కెట్లతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. అమెరికా–ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మళ్లీ చుక్కలను తాకుతున్నాయి. సౌదీ అరేబియా ఇంధన ఉత్పాదక కేంద్రాలపై హౌతీ మిలిటెంట్లు డ్రోన్లు, క్షిపణులతో దాడి చేయడంతో పశ్చిమాసియాలో టెన్షన్ వాతావరణం మరింత పెరిగింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు రేటు మరోసారి 100 డాలర్లను సమీపించింది. దీంతో మిడిల్ ఈస్ట్‌లో అశాంతి పెరిగితే క్రూడాయిల్ ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయి.దేశ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇందులో రష్యాతోపాటు మిడిల్ ఈస్ట్ దేశాల వాటానే ఎక్కువ. అయితే యుద్ధంతో యూఏఈ, సౌదీ, ఖతార్, బహ్రెయిన్, కువైట్ తదితర గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు ముడి చమురు, గ్యాస్ రాక ఇబ్బందికరంగా మారింది. పెట్రో ఉత్పత్తుల రవాణాకు కీలకమైన హ్ర్మూజ్ జలసంధిలో నౌకల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నౌకలపై దాడులు జరిగితే బ్యారెల్ విలువ 120 డాలర్లను తాకే అవకాశం ఉంది. అమెరికాకు మద్దతిస్తున్నాయని గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులకు దిగుతోంది.మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు దేశీయ మార్కెట్‌లో పెట్రో ధరల పెంపునకు దారితీస్తున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం వల్ల భారత ఆర్థిక వ్యవస్థ ఒత్తిడికి లోనవుతోంది. చమురు దిగుమతుల చెల్లింపుల భారం, ఇంధన ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం విజృంభణ, రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల పెంపు, స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు, రూపాయి మారకం విలువ క్షీణత, చమురు ఆధారిత ఉత్పత్తుల తయారీ ఖరీదెక్కడం, ఎగుమతుల పతనం వంటివి దేశ ఎకానమిని రిస్క్‌లో పడేస్తున్నాయి.ఈ ఏడాది ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభం కాగా, అప్పట్నుంచి ఇప్పటిదాకా దేశంలో లీటర్ పెట్రోల్ రేటు రూ.7.35, డీజిల్ ధర రూ.7.53 పెరిగింది. అమెరికాతో ఇరాన్ చర్చల కారణంగా అప్పట్లో కొంతమేర శాంతియుత పరిస్థితులు మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్నాయి. ఇది మార్కెట్‌లో క్రూడ్ ధరల తగ్గుముఖానికి కలిసొచ్చింది. అయితే మళ్లీ దాడులు మొదలవడంతో పరిస్థితి మొదటికొచ్చింది. ఇక ఈ ఏడాది ఏప్రిల్–జూలైలో భారత ముడి చమురు దిగుమతుల విలువ 56 శాతం పెరిగి 63.4 బిలియన్ డాలర్లకు చేరింది. నిరుడు ఇదే సమయంలో 40.5 బిలియన్ డాలర్లేనని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

జూరాలకు నీటి విడుదలకు ఓకే

హైదరాబాద్ తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విడతల వారీగా 3 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులకు భారీ ఊరట లభించినట్లయింది.ఈ మేరకు బుధవారం తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నేతృత్వంలోని ప్రజాప్రతినిధుల బృందం బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైంది. జూరాల ప్రాజెక్టు కింద నీటి అవసరాలను, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వారు ఆయనకు వివరించారు.తెలంగాణ మంత్రుల విజ్ఞప్తిని పరిశీలించిన డీకే శివకుమార్, అధికారులతో చర్చించిన అనంతరం జూరాలకు నీటిని విడుదల చేసేందుకు అంగీకరించారు. దీంతో జూరాల ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కర్ణాటక సానుకూలంగా స్పందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితి, వారి కష్టాలను డీకేకు వివరించారు. జూరాల ప్రాజెక్టుతో పాటు భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఆయకట్టు పంటలను కాపాడాలని కర్ణాటక సీఎంకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టుల కింద 5.5 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోందని, ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు.
ప్రస్తుతం ఆయకట్టు పరిధిలోని పంటలు కీలక దశలో ఉన్నాయని.. నీళ్లు లేకపోతే పంటలు ఎండిపోయి దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని శివకుమార్ కు తెలంగాణ ప్రతినిధుల బృందం వివరించింది.ఉమ్మడి పాలమూరు రైతులు నీళ్లపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, పంటలు ఎండిపోతే వారి ఆదాయం, జీవనోపాధిపై ప్రభావం పడుతుందన్నారు. తెలంగాణ మంత్రులు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించి సీఎం శివకుమార్ అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.దాదాపు 5 వేల క్యూసెక్కుల వరకు కృష్ణా జలాలు విడుదల చేయాలని తెలంగాణ నేతలు కోరినట్లు తెలుస్తోంది. ఉమ్మడి పాలమూరు మంత్రులు, ఎమ్మెల్యేల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన సీఎం డీకే శివకుమార్.. రైతులను ఆదుకునేందుకు నీటి విడుదలకు నిర్ణయం తీసుకుని అధికారులను ఆదేశించారు. రైతుల ఆదుకునేందుకు కృష్ణా జలాల విడుదలకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించడంతో పాలమూరు ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి నీళ్లు విడుల చేయక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఉమ్మడి పాలమూరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తే గతవారం వారే స్వయంగా వెళ్లి రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేసుకున్నారు.
అధికారులు పోలీసుల సహాయంతో గేట్లు క్లోజ్ చేసి నీటి విడుదలను తాత్కాలికంగా నిలిపివేశారు. అయితే రైతులతో కలిసి బీఆర్ఎస్ నేతలు జూరాల ప్రాజెక్టు నీటి విడుదల కోసం వారం రోజుల నుంచి ఆందోళన చేపడుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి, నీటి విడుదలకు డీకే శివకుమార్ ను ఒప్పించడంలో సక్సెస్ అయింది.

రాష్ట్రంలోని 14 లక్షల మంది విద్యార్థుల స్కాలర్ షిప్ లు - ఫీజులు వెంటనే చెల్లించాలి
-విద్యానగర్ నుంచి వేలాదిమంది విద్యార్థులతో భారీ ప్రదర్శన -రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై ఆర్.కృష్ణయ్య ఫైర్

హైద్రాబాద్: రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల స్కాలర్ షిప్, ఫీజుల బకాయిలు 8500కోట్లు వెంటనే విడుదల చేయాలని, ఈ స్కీము ఎత్తివేయాలనే కుట్రలు మానుకోవాలని, ఈ స్కీమును యధాతధంగా పాత పద్ధతిలోనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు నేడు విద్యానగర్ నుంచి భారీ ప్రదర్శన జరిపారు. ఈ ప్రదర్శనకు బిసి సంక్షేమ సంఘం సంఘం జాతీయఅ ధ్యక్షులు,రాజ్య సభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ స్కీముకు బడ్జెట్ ఇవ్వకుండా ముఖ్యమంత్రి పేద కులాల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ఫీజుల బకాయిలు ఇవ్వాలని శాంతియుతంగా ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు చదువుకుంటుంటే కూడా ఓర్వలేక పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్ట పట్టిస్తున్నారని పేద కులాలు చదువుకోకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.ఈ ఫీజుల బకాయిలు 8500 కోట్లు చెల్లించడం ముఖ్యమంత్రికి ఒకలెక్క కాదు. మూడున్నర సంవత్సరాలుగా విద్యార్థులు పడుతున్న భాదలు చెప్పతరం కాదు. కోర్సు పూర్తి అయిన 6 లక్షల మందికి కాలేజి యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదు.
వీరికి ఉద్యోగాలు వచ్చిన చేరలేక – ఉన్నత విద్యకు పోలేక చాల ఇబ్బంది పడుతున్నారు. చదువుతున్న వారి ఫీజులు కట్టే వరకు కాలేజీలకు రానివ్వడంలేదు. ఫీజుల బకాయిలు చెల్లించక పోవడంతో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ భారీ ప్రదర్శనలో రాష్ట్ర బి.సి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, రాష్ట్ర బి.సి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ నిఖిల్ పటేల్, అధ్యక్షులు పగిళ్ళ సతీష్, బి.సి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి. రాజేందర్, నరేష్ గౌడ్, శివ కుమార్ యాదవ్, రమేష్, రాహుల్, సురేష్, రమణ, కె. వంశీ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ఎవరు చేయొచ్చు...?



మనం చేసే రక్తదానం అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఎంతో మంది ప్రాణాలను కాపాడటంలో సహాయపడుతుంది. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవ సమయంలో రక్తస్రావం, తీవ్రమైన అనారోగ్యాలు వంటి అనేక సందర్భాల్లో రక్తం అవసరం అవుతుంది. అయితే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి అర్హులు కాదు. కొన్ని ఆరోగ్య పరిస్థితుల్లో తాత్కాలికంగా రక్తదానం చేయకూడదు. మరికొన్ని సందర్భాల్లో దీర్ఘకాలం లేదా శాశ్వతంగా రక్తదానానికి దూరంగా ఉండాల్సి రావచ్చు. అందుకే రక్తదానం చేయాలనే ఆసక్తి మాత్రమే కాకుండా.. మన ఆరోగ్య పరిస్థితి గురించి రక్తదానం చేసే కేంద్రంలోని వైద్య సిబ్బందికి సరైన సమాచారం అందించడం కూడా చాలా ముఖ్యం. భారత్‌లో సాధారణంగా రక్తదానం చేయాలంటే వ్యక్తి వయసు 18 నుంచి 65 సంవత్సరాల మధ్య ఉండాలి. తొలిసారి రక్తదానం చేసే వ్యక్తి వయసు 60 సంవత్సరాలకు మించకూడదు. రెగ్యులర్‌గా రక్తదానం చేసేవారికి గరిష్ఠ వయసు 65 సంవత్సరాలుగా ఉంటుంది. రక్తదాత బరువు కనీసం45 కిలోల ఉండాలి. 350 మి.లీ. రక్తదానం చేయడానికి కనీసం45 కిలోల బరువు అవసరం కాగా.. 450 మి.లీ. రక్తదానం కోసం సాధారణంగా 55 కిలోల కంటే ఎక్కువ బరువు ఉండాలి. రక్తదానం చేసే ముందు హీమోగ్లోబిన్, రక్తపోటు, పల్స్, శరీర ఉష్ణోగ్రతతో పాటు ఇతర ఆరోగ్య ప్రమాణాలను వైద్య సిబ్బంది పరిశీలిస్తారు. 2025లో అమల్లో ఉన్న రక్తదాతల ఎంపిక మార్గదర్శకాల ప్రకారం పురుషులు సాధారణంగా 90 రోజుల విరామంతో, మహిళలు 120 రోజుల విరామంతో మరోసారి పూర్తి రక్తాన్ని దానం చేయవచ్చు. అయితే తుది అర్హతను రక్తదాన కేంద్రంలోని వైద్య పరీక్షల తర్వాతే నిర్ణయిస్తారు. జ్వరం, ఫ్లూ, వైరల్ ఇన్ఫెక్షన్ లేదా ఇతర క్రియాశీల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న సమయంలో రక్తదానం చేయకూడదు. పూర్తిగా కోలుకున్న తర్వాతే రక్తదానం చేయడం మంచిది. ఇటీవల ఏదైనా అనారోగ్యానికి గురైనట్లయితే.. రక్తదానం చేసే ముందు వైద్య సిబ్బందికి తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలి. రక్తదానానికి కనీస బరువు ప్రమాణం ఉంటుంది. బరువు తక్కువగా ఉన్న వ్యక్తి నుంచి రక్తం తీసుకోవడం వల్ల దాత ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. అందుకే రక్తదానం చేసే ముందు బరువును కూడా పరీక్షిస్తారు. గర్భధారణ సమయంలో మహిళలు రక్తదానం చేయకూడదు. ఈ సమయంలో తల్లి, గర్భంలోని శిశువు ఇద్దరికీ తగినంత పోషకాలు, రక్త సరఫరా అవసరం ఉంటుంది. ప్రసవం తర్వాత కూడా వెంటనే రక్తదానం ప్రారంభించకూడదు.

డ్రాగన్ ఫ్రూట్ అందరికీ మంచిదేనా....?



డ్రాగన్ ఫ్రూట్ చూడటానికి ఆకర్షణీయంగా ఉండటమే కాకుండా, ఫైబర్, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలు ఉండే పండుగా చాలామందికి తెలుసు. అందుకే ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టేవారు, బరువు నియంత్రించుకోవాలనుకునేవారు దీన్ని తమ ఆహారంలో చేర్చుకుంటున్నారు. అయితే ఒక ఆహారం ఆరోగ్యకరమైనదని చెప్పడం మాత్రమే కాకుండా, అది ఎవరికి ఎలా సరిపోతుందో కూడా తెలుసుకోవడం ముఖ్యం. ముఖ్యంగా కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు డ్రాగన్ ఫ్రూట్‌ను ఎక్కువగా తీసుకుంటే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. అలర్జీలు, మధుమేహం లేదా మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు డ్రాగన్ ఫ్రూట్‌ను తీసుకునే విషయంలో ప్రత్యేక జాగ్రత్త అవసరం. అయితే ప్రతి ఒక్కరూ ఈ పండును పూర్తిగా మానేయాల్సిన అవసరం ఉందని చెప్పడం సరికాదు. వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, తీసుకుంటున్న మందులు, ఆహారపు అలవాట్లను బట్టి పరిమాణం మారవచ్చు.

మరి ఎలాంటి వారు డ్రాగన్ ఫ్రూట్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి? డ్రాగన్ ఫ్రూట్ తిన్న తర్వాత కొంతమందిలో అలర్జీ ప్రతిచర్యలు కనిపించే అవకాశం ఉంది. దురద, పెదవులు లేదా నాలుక వాపు,

వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే దీనిని తినడం ఆపాలి. ముఖ్యంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి తీవ్రమైన లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.

లవంగాల పాలు ఔషధాల గని



సీజన్ మారిన ప్రతిసారి వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల జలుబు, దగ్గు, జ్వరం, కీళ్ల నొప్పులు వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఇబ్బంది పెడుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి లవంగాల పాలు అద్భుతమైన ఔషధంగా పనిచేస్తాయి. భారతీయ వంటింట్లో దొరికే లవంగాలు, పాల కలయిక శరీరానికి ఎనలేని శక్తిని ఇస్తుంది. ప్రశాంతమైన నిద్ర పడుతుంది.రోగనిరోధక శక్తి పెంపు: లవంగాలలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి పాలతో కలిసి తీసుకున్నప్పుడు శరీరంలో రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తాయి. చలికాలంలో వ్యాపించే రకరకాల ఇన్ఫెక్షన్ల నుండి శరీరాన్ని కాపాడటంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. జలుబు, గొంతు నొప్పి నుండి ఉపశమనం: లవంగాలలో ఉండే యూజినాల్ అనే కాంపౌండ్ యాంటీబాక్టీరియల్, యాంటీవైరల్ గుణాలను కలిగి ఉంటుంది.

గొంతు నొప్పి, పొడి దగ్గు, నాసికా రంధ్రాల మూసుకుపోవడం వంటి సమస్యలతో బాధపడేవారు లవంగాల పాలు తాగడం వల్ల తక్షణ ఉపశమనం లభిస్తుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది: రాత్రి వేళ లవంగాల పాలు తాగడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. ఇది కడుపుఉబ్బరం, గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలను సమర్థవంతంగా నివారిస్తుంది. ఆహారం త్వరగా అరగడానికి సహాయపడుతుంది. ఎముకలు, పళ్ల ఆరోగ్యానికి మేలు: పాలలో క్యాల్షియం, విటమిన్ డి సమృద్ధిగా ఉంటాయి. లవంగాలలో ఉండే మాంగనీస్ ఎముకల సాంద్రతను పెంచడానికి ఉపయోగపడుతుంది.

వర్షాకాలంలో ఖర్జూరాలు తినొచ్చా?



ఖర్జూరాలు ప్రకృతి మనకు అందించిన అత్యంత తీపి, పోషకమైన పండ్లలో ఒకటి. ప్రాసెస్ చేసిన స్వీట్లకు ప్రత్యామ్నాయంగా, ఆరోగ్యకరమైన తీపిని కోరుకునే వారికి ఇవి ఒక అద్భుతమైన ఎంపిక. వీటిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరానికి కావలసిన ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. అయితే, వర్షాకాలంలో ఖర్జూరాలు తినేవారు ఈ విషయాలు తప్పక తెలుసుకోవాలి. పోషకాల గని: ఖర్జూర పండ్లు రుచికే కాకుండా అద్భుతమైన పోషక విలవలకు నిలయం. ఒక మోస్తరు పరిమాణంలో ఉండే ఖర్జూరాల్లో శరీరానికి అవసరమైన విటమిన్ ఃB6, పొటాషియం, మెగ్నీషియం, రాగి, మాంగనీస్, ఐరన్ సమృద్ధిగా లభిస్తాయి. వీటిలో కొవ్వు పదార్థాలు చాలా తక్కువగా ఉంటాయి. జీర్ణ వ్యవస్థకు కొండంత అండ: ఖర్జూరాలలో పీచు పదార్థం చాలాఎక్కువగా ఉంటుంది. ఇదిజీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, ప్రేగుల కదలికలను క్రమబద్ధీకరిస్తుంది. క్రమం తప్పకుండా ఖర్జూరాలు తీసుకోవడం వల్ల మలబద్ధకం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు నయమవుతాయి. తక్షణ శక్తి, మెరుగైన గుండె ఆరోగ్యం: ఇందులో గ్లూకోజ్, ఫ్రక్టోజ్ వంటి సహజసిద్ధమైన చక్కెరలు ఉండటం వల్ల నీరసంగా ఉన్నప్పుడు ఇవి శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. అలాగే, ఖర్జూరాల్లోని పొటాషియం, మెగ్నీషియం సోడియం ప్రభావాన్ని తగ్గించి, రక్తపోటును అదుపులో ఉంచుతాయి. ఇవి రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ చేరకుండా కాపాడి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

ప్రతి మహిళకు దొరికే గొప్ప వరం..



సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత తన సీమంతం ఫొటోలను షేర్ చేస్తూ ఎమోషనల్ అయింది. 'గోద్ భరాయి' (సీమంతం) వేడుకను కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య చాలా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మన సంప్రదాయాలు, ఆచారాల గొప్పతనాన్ని వివరిస్తూ ఆమె రాసుకొచ్చిన ఒక ఎమోషనల్ నోట్ ప్రస్తుతం అందరినీ ఎంతగానో ఆకట్టుకుంటోంది. మన సంప్రదాయాలపై తనకు చిన్నప్పటి నుంచి ఎంతో గౌరవం ఉందని సమంత చెప్పుకొచ్చారు. ప్రతి ఆచారం వెనుక ఉన్న అంతరార్థం పూర్తిగా తెలియకపోయినా, వాటి వెనుక ఒక బలమైన శక్తి, లోతైన అర్థం దాగి ఉంటాయని తాను గట్టిగా నమ్ముతానని తెలిపారు. మంత్రోచ్చారణల ద్వారా వెలువడే సానుకూల శక్తి, తరతరాలుగా వస్తున్న ప్రాచీన ఆచారాలు మనిషికి ఎంతో మానసిక ప్రశాంతతను ఇస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు.

ఈ వేడుకలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక క్రతువు గురించి వివరిస్తూ.. "కళావరణం అనేది శ్రీవిద్య సంప్రదాయానికి చెందిన ఒక ప్రత్యేకమైన క్రతువు. ఈ ప్రక్రియలో శ్రీవిద్య ఉపాసకులు మంత్రాలు పఠిస్తూ పవిత్ర జలంతో గర్భిణి అయిన మహిళకు అభిషేకం చేస్తారు. దీనివల్ల అమ్మవారి దివ్యమైన గుణాలు ఆ మహిళలో సరికొత్త చైతన్యాన్ని నింపుతాయని నమ్ముతారు" అని సమంత వెల్లడించారు. ఈ మొత్తం క్రతువులో తనను ఎంతగానో కదిలించిన విషయం ఏమిటంటే.. తనలో మరో కొత్త ప్రాణానికి రూపమిస్తున్న సృష్టికర్త అయిన తల్లిని గౌరవించడమేనని ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. గర్భంలో పెరుగుతున్న పసిబిడ్డకు ఇదొక అద్భుతమైన ఆశీర్వాదం మాత్రమే కాకుండా, మాతృత్వమనే సరికొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న ప్రతి మహిళకు దొరికే గొప్ప వరం అని సమంత పేర్కొన్నారు.

రిలేషన్‌షిప్‌పై హింట్ ఇచ్చిన తరుణ్ భాస్కర్

టాలీవుడ్‌లో మోస్ట్ టాలెంటెడ్ డైరెక్టర్ కమ్ యాక్టర్ తరుణ్ భాస్కర్, గ్లామరస్ బ్యూటీ ఈషా రెబ్బా రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. 'ఓం శాంతి శాంతి శాంతి' సినిమాలో తొలిసారిగా వీరు కలిసి నటించారు. అయితే అప్పటి నుంచి వీరిద్దరూ ఎక్కడికి వెళ్లినా కలిసి కనిపించడం, పలు ఈవెంట్లు, వెకేషన్స్‌కు కలిసి వెళ్తూ మీడియాకు చిక్కుతుండటంతో వీరి డేటింగ్ రూమర్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. ఈ వార్తలపై గతంలో స్పందించిన తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా తాము కేవలం మంచి స్నేహితులమని క్లారిటీ ఇచ్చినప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం వీరికి సంబంధించిన పుకార్లు ఎప్పుడూ ఆగడం లేదు. రూమర్స్‌కు మరింత బలం చేకూర్చేలా మరో ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. ఈ ఇద్దరూ కలిసి వినాయక చవితి వేడుకలను అత్యంత ఆనందంగా జరుపుకున్నారు. పండగ రోజున కలిసి పూజ చేస్తున్న ఒక ప్రత్యేకమైన ఫొటోను తరుణ్ భాస్కర్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. ఈ ఫొటో ఒక్కసారిగా టాలీవుడ్ చర్చకు దారితీసింది. ఈ పోస్ట్‌పై ప్రముఖ నటి మంచు లక్ష్మితో పాటు పలువురు సెలబ్రిటీలు, నెటిజన్లు స్పందిస్తూ తమ సంతోషాన్ని, తెలియజేస్తున్నారు. తరుణ్ భాస్కర్ షేర్ చేసిన ఈ ఫొటో చూసిన నెటిజన్లు రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు.



యుద్ధరంగమే ఆమెను చూసి భయపడుతుంది



మంచు మనోజ్ హీరోగా, హనుమరెడ్డి యక్కండి దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పవర్ ప్యాక్డ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'దేవిడ్ రెడ్డి'. బ్రిటిష్ పరిపాలనా కాలం నాటి నేపథ్యంలో, మన దేశ స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన ఒక సాహసోపేతమైన విప్లవాన్ని ఈ చిత్రంలో చూపించబోతున్నారు. ఈ సినిమాలో రష్యన్ బ్యూటీ, 'ప్రిన్స్' ఫేమ్ మరియా రియాబోషాప్కా నటిస్తుండగా, ఆంగ్లేయుల అన్యాయాలను ఎదిరించి పోరాడే యోధుడిగా మంచు మనోజ్ కనిపించనున్నారు. ఈ సినిమాలో సీనియర్ స్టార్ హీరోయిన్ రమ్యకృష్ణ కీలక పాత్రలో నటిస్తున్నారు. నేడు ఆమె పుట్టినరోజు కావడంతో, మేకర్స్ ఆమె పాత్రకు సంబంధించిన ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. 'బాహుబలి' చిత్రంలో శివగామి పాత్ర ఎంతటి పేరు తెచ్చిపెట్టిందో, ఈ చిత్రంలో ఆమె అంతకు మించిన ఉగ్రరూపంలో 'కమలారెడ్డి'గా అలరించనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. ఇక విడుదలైన పోస్టర్‌లో ఒక కుర్చీపై తీవ్రమైన కోపంతో కూర్చుని, చేతిలో పెద్ద కత్తి పట్టుకుని ఉన్న రమ్యకృష్ణ లుక్ అందరినీ విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఆమె పాదాల కింద శవాలు, చుట్టూ రక్తపు మడుగుతో ఉన్న ఈ విజువల్స్ ప్రేక్షకులకు గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయి. 'ఆమెకు యుద్ధభూమి అంటే భయం లేదు.. యుద్ధభూమియే ఆమెకు భయపడుతుంది' అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై అంచనాలను పెంచుతోంది.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com